TELTEL/2015/66279
# అగ్రనేత
తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :114 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 05-07-2025 | పేజీలు:4 వెల: 2.00

## ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణి దాడి..

రష్యా–ఉక్రెయిన్ వెనుక యుద్ధాలు మొదలు పెట్టిన దేశాలన్నీ ఇప్పుడు ప్రశాంతంగా ఉన్నాయి. కాల్పుల విరమణతో శాంతి వాతావరణం చోటుచేసుకున్నాయి. ఇరాన్–గాజా–ఇజ్రాయెల్ దేశాల మధ్య ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొంది.అలాగే భారత్–పాకిస్థాన్ మధ్య కూడా నెమ్మదిగానే ఉంది. కానీ రష్యా–ఉక్రెయిన్ మధ్య మాత్రం ఇంకా యుద్ధం చల్లారలేదు.. నిత్యం కాల్పులతో ఇరు దేశాలు దద్దరిల్లుతున్నాయి. తాజాగా శుక్రవారం తెల్లవారుజామున ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణి ప్రయోగించింది. నివాసాల మధ్య దాడి చేయడంతో పలు భవంతులు తగలబడ్డాయి. ఉక్రెయిన్‌లోని కైవ్ విమానాశ్రయానికి రష్యన్ దళాలు నిప్పుపెట్టాయి. అలాగే నివాసాలపై డ్రోన్, క్షిపణులను ప్రయోగించింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దాదాపు 6 గంటల పాటు ఈ దాడులు జరిగినట్లు సమాచారం. 13 ప్రదేశాల్లో ఈ దాడి ప్రభావం కనిపించింది. శుక్రవారం తెల్లవారుజామున కైవ్‌పై రష్యన్ దళాలు పెద్ద ఎత్తున డ్రోన్, క్షిపణి దాడిని ప్రారంభించాయని.. నివాస ప్రాంతాలపై దాడి చేయడంతో మంటలు చెలరేగాయని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు.

## నిరుద్యోగులను అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య



హైదరాబాద్ : ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తామని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన ద్రోహంపై నిలదీసేందుకు వచ్చిన నిరుద్యోగులను అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యంలో సచివాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఊదరగొట్టిన సీఎం రేవంత్ రెడ్డికి నిరుద్యోగుల కష్టాలు కనిపించడం లేదా..? అని ప్రశ్నించారు.అశోక్ నగర్ చౌరస్తాలో రాహుల్ గాంధీని పిలిపించి మరీ నిరుద్యోగులతో చాయ్ పే చర్చ పెట్టిన రేవంత్‌కు గద్దెనెక్కిన తరువాత జాబ్ క్యాలెండర్ అసలు గుర్తే లేదా..? చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు తెలంగాణ వ్యాప్తంగా అనేక జిల్లాల్లో నిరుద్యోగులు హైదరాబాద్ రాకుండా ముందుగానే నిర్బంధించడమే దారుణమైతే, ఇవాళ సచివాలయానికి గోడు చెప్పుకునేందుకు వచ్చిన వారిని కూడా అరెస్టు చేయడం దుర్మార్గం అని కేటీఆర్ మండిపడ్డారు.యూత్ డిక్లరేషన్ పేరిట ఢిల్లీ పెద్దలను పిలిపించి మరీ మోసం చేసిన రేవంత్ ఏడాదిన్నర కాలంలో పట్టుమని పదివేల ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వకపోవడం నిరుద్యోగులకు వెన్నుపోటు పొడవడమే. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రక్రియ పూర్తి చేసిన 60 వేల ఉద్యోగాలకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి చేతులు దులుపుకున్న చేతకాని ముఖ్యమంత్రిని నిరుద్యోగులు ఎప్పటికీ క్షమించరు. ఓవైపు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాలు ఇంకెప్పుడు అని నిరుద్యోగులు ఎదురుచూస్తుంటే, మరోవైపు నిరుద్యోగులు నోటిఫికేషన్లే వద్దంటున్నారని బుకాయించడం కాంగ్రెస్ సర్కారు దిగజారుడుతనానికి నిదర్శనం అని కేటీఆర్ ఫైర్ అయ్యారు.ఏడాదిలోనే జాబ్ క్యాలెండర్‌లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని మాటిచ్చి మోసం చేసిన ముఖ్యమంత్రికి నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయం. చలో సచివాలయం కార్యక్రమాన్ని చేపట్టిన నిరుద్యోగులను అక్రమంగా అరెస్టుచేసి వారి గొంతులు నొక్కలేరు. వెంటనే వారందరినీ బేషరతుగా విడుదల చేసి ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను ఇప్పటికైనా నిలబెట్టుకోవాలి. లేకపోతే రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించి రేవంత్ సర్కారు మెడలు వంచుతాం.. కాంగ్రెస్ సర్కారు చేసిన ద్రోహాన్ని గడపగడపకూ తీసుకెళ్లి ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీని దోషిగా నిలబెడతాం అని కేటీఆర్ హెచ్చరించారు.

## రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్, ఖర్గే

హైదరాబాద్,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కన్నా లక్ష్మీనారాయణ రోశయ్య జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని హైదరాబాద్‌లోని లక్షీకాపూల్‌లో ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కలిసి పాల్గొన్నారు. రోశయ్య సేవలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ వేడుకకు కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ, రోశయ్య రాజకీయాల్లో చేసిన సేవలు తీరని ముద్రవేశాయన్నారు. ఆయనకు సరైన గౌరవం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఏటా జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసిందని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీలో నిష్ట, నిబద్ధతకు రోశయ్య ఓ ఉదాహరణ అని మల్లికార్జున ఖర్గే అన్నారు. ప్రజల పట్ల ఆయన చూపిన సేవా దృక్పథం అందరికీ ప్రేరణగా



నిలుస్తుందన్నారు.

## మోదీ రాసిన కవితను వినిపించిన ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధాని

టొబాగో: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ  విదేశీ పర్యటన కొనసాగుతోంది. ఐదు దేశాల పర్యటనలో భాగంగా ప్రస్తుతం ట్రినిడాడ్ అండ్ టొబాగోలో పర్యటిస్తున్నారు. టొబాగో చేరుకున్న మోదీకి ఆ దేశ ప్రధాని ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గుజరాతీలో రాసిన కవితను ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధాని  కమ్లా ప్రసాద్ బిసెస్సార్ చదవి వినిపించారు.గుజరాతీ భాషలో 'ఆంఖ్ ఆ ధన్య ఛే' పేరిట మోదీ రాసిన పుస్తకంలోని కవితను  వినిపించిం అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. 'గడిచిపోయిన రోజుల్లోకి మనసుతో ప్రయాణించినప్పుడు ఎన్నో జ్ఞాపకాలు కళ్లముందు కదలాడతాయి. కష్టకాలంలో మనతో నడిచిన వారిని ఎప్పటికీ మర్చిపోలేం. ఆ జ్ఞాపకాలే మన ప్రయాణంలో భాగమవుతాయి' అని అర్థం వచ్చే కవితనను అందరి సమక్షంలో చదివి వినిపించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.కరేబియన్ దేశమైన ట్రినిడాడ్ అండ్ టొబాగో జనాభాలో దాదాపు 40 శాతం మంది భారత సంతతికి చెందినవారే. భారత విదేశాంగ శాఖ లెక్కల ప్రకారం, ఈ దేశంలో సుమారు 5.56 లక్షల మంది



భారతీయ మూలాలున్న ప్రజలు నివసిస్తున్నారు. ఇక ఆ దేశ ప్రధాని కమ్లా కూడా భారత మూలాలున్న వ్యక్తే కావడం విశేషం. ఈ సందర్భంగా కమ్లాను బీహార్ ముద్దుబిడ్డగా ప్రధాని పేర్కొన్నారు. ఆమె పూర్వీకులు బీహార్ బక్సర్‌కు చెందిన వారని తెలిపారు. అందుకే కమ్లాను బీహార్ ఆడబిడ్డగా భావిస్తారన్నారు.

## తుది దశకు వాణిజ్య చర్చలు..



న్యూఢిల్లీ,భారత్–అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం చర్చలు తుది దశకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రధాని మోదీ–ట్రంప్ మధ్య సంభాషణ జరిగిన తర్వాత జూలై 9కి ముందు ఒక ప్రకటన వెలువడే అవకాశం ఉందని వర్గాలు పేర్కొన్నాయి.అధికారుల స్థాయిలో చర్చలు ముగిశాయని.. కానీ మోదీ–ట్రంప్ మధ్య జరిగే రాజకీయ దిశానిర్దేశం తర్వాత ఒక క్లారిటీ వస్తుందని చర్చల్లో పాల్గొన్న వ్యక్తి వెల్లడించారు. రెండు వైపులా చర్చలు ముగిశాయని.. రెండు దేశాల అధినేతల చర్చల తర్వాతే ఫైనల్ అయ్యే ఛాన్సుందని వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఈ సమావేశం ఎప్పుడు జరుగుతుందనేది సందిగ్ధం నెలకొంది. ప్రస్తుతం మోదీ ఐదు దేశాల పర్యటనలో ఉన్నారు. ఎప్పుడు ట్రంప్–మోదీ మాట్లాడుకుంటారనే దానిని బట్టే వాణిజ్య ఒప్పందం ఫైనల్ అవుతోంది.అయితే భారత్‌లో వ్యవసాయం, పాడి శ్రమకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. అయితే ప్రాముఖ్యమైన భారతీయ రంగాలను దెబ్బ కొట్టేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. ఈ విషయంలో మోదీ సర్కార్ వెనుకంజ వేస్తోంది. పశుగ్రాసంలో ఉపయోగించే కొన్ని జన్యుపరంగా మార్పు చేసిన వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులను అనుమతించాలనే అమెరికా అభ్యర్థనపై భారత్ వెనక్కి తగ్గుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఇరు దేశాల మధ్య చర్చలు ఫైనల్‌కు రాలేదని తెలుస్తోంది.వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్ నేతృత్వంలోని భారత సంధానకర్తల బృందం.. ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి యునైటెడ్ స్టేట్స్ వాణిజ్య ప్రతినిధి బృందంతో తీవ్రమైన చర్చల్లో పాల్గొంది. జూన్ 5–10 మధ్య భారతదేశం–అమెరికా ఒక రౌండ్ చర్చలు జరిపాయి. ట్రంప్ విధించిన 26 శాతం సుంకాల నుంచి భారత్ ఉపశమనం పొందాలని చూస్తోంది. వస్త్రాలు, తోలు, పాదరక్షలు వంటి ఎగుమతులకు సుంకాల రాయితీ కోసం భారత్ ప్రయత్నిస్తోంది. ఇక జూన్ 27న మరోసారి భారత్ బృందం అమెరికాకు వెళ్లి వారం పాటు చర్చలు జరిపింది. ఈ చర్చలన్నీ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. ఎప్పుడు ఫైనల్ ప్రకటన వస్తుందో ఉత్కంఠ నెలకొంది.అయితే తాజాగా డెడ్‌లైన్ దగ్గర పడుతుండడంతో ఆయా దేశాలకు అమెరికా లేఖలు పంపిస్తోంది. ఇదే అంశంపై విలేకర్ల సమావేశంలో ప్రస్తావించారు. ఆగస్టు 1 నుంచి వాణిజ్య దేశాలు సుంకాలు చెల్లించాల్సిందేనని.. ఈ మేరకు శుక్రవారం నుంచి లేఖలు పంపిస్తున్నట్లు తెలిపారు. ఇక రాబోయే కొద్ది రోజుల్లో అయితే అదనపు లేఖలు కూడా వస్తాయని పేర్కొన్నారు. వాణిజ్య భాగస్వామ దేశాలకు సుంకాల రేట్లను తెలియజేస్తూ లేఖలు ప్రారంభించినట్లు వెల్లడించారు. శుక్రవారం 10–12 దేశాలకు లేఖలు అందుతాయని.. 60–70 శాతం, 10–20 శాతం వరకు సుంకాలు ఉంటాయని పేర్కొన్నారు.జూలై 9లోగా దేశాలు ఒప్పందాలు చేసుకోకపోతే అధిక రేట్లు విధిస్తామంటూ గతంలో ట్రంప్ పలుమార్లు హెచ్చరించారు. ఇప్పటి వరకు యూకే, వియత్నాం ఒప్పందాలు చేసుకున్నాయి. ఇక చైనా కూడా పరస్పరం సుంకాలు తగ్గించుకునేందుకు ఒప్పందాలు చేసుకున్నాయి. ఇక భారతదేశంతో అమెరికా ఒప్పందాన్ని కుదుర్చుకోగలదని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## చెల్లని రూపాయిగా మిగిలిపోయిన చేవెళ్ల డిక్లరేషన్



హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ సీనియర్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిప్పులు చెరిగారు. చెల్లని రూపాయిగా చేవెళ్ల డిక్లరేషన్ మిగిలిపోయిందని తీవ్రంగా విమర్శించారు. మల్లిఖార్జున ఖర్గే గారూ, మీ 2023 చేవెళ్ల డిక్లరేషన్ గుర్తుందా? కేవలం చెల్లని రూపాయిగా మిగిలిపోయిన ఈ మాయదారి డిక్లరేషన్ గురించి ఈ రోజు ఎల్బీ స్టేడియంలో మీరు మాట్లాడతారని ఆశిస్తున్నాను అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.నాడు కాంగ్రెస్ అందరికీ ఆమోదయోగ్యంగా ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పారు. కానీ నేడు రిజర్వేషన్లు పెంచామని చెప్పి, మాదిగ ఉపకులాలను, మాల ఉపకులాలను నిలువునా మోసం చేశారు. గ్రూప్ 1, గ్రూప్ 2 నియామకాల్లో వర్గీకరణ అమలు చేయకుండా అన్ని ఉపకులాలకు అన్యాయం చేసిన పార్టీ మీ కాంగ్రెస్. కావాలంటే రేవంత్ రెడ్డిని అడగండి అని ఖర్గేకు ఆర్ఎస్పీ సూచించారు.కేసీఆర్ 10 లక్షలు ఇచ్చే దళిత బంధు కన్నా బాగా 2 లక్షలు పెంచి, రూ. 12 లక్షలతో అంబేద్కర్ అభయ హస్తం పథకం అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పింది. అధికారంలోకి వచ్చాక రెండు సార్లు వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టింది మీ కాంగ్రెస్ పార్టీ. ఈ పథకం కింద నేటికీ ఒక్క లబ్దిదారుడిని కూడా ఎంపిక చేయలేకపోయారు, ఎందుకు? కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ప్రొక్యూర్‌మెంట్, అన్ని కాంట్రాక్టుల్లో ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని నాడు హామీ ఇచ్చారు. ప్రైవేట్ విద్యా సంస్థలు, ప్రైవేట్ కంపెనీల్లో కూడా రిజర్వేషన్లు కల్పిస్తామని మీరు హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఒక్క కాంట్రాక్టు అయినా ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చారా? కనీసం కొడంగల్–నారాయణపేట పథకంలో కూడా ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్ల జాడ లేదు! ఈ వివరాలు కూడా మీరు ఈ రోజు వెల్లడించాలి అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.ఎస్సీ, ఎస్టీలకు ఇంటి స్థలంతో పాటు, ఇంటి నిర్మాణానికి రూ. 6 లక్షల ఆర్థిక సాయం, ఐదేండ్లలో అర్హులైన వారందరికీ ఇస్తామన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఎంత మంది ఎస్సీ, ఎస్టీలకు ఇంటి స్థలం ఇప్పించారు? ఎన్ని ఎకరాల స్థలం ఇప్పటి వరకు పంచారు? తెలంగాణ లో ఎస్సీ ఎస్టీల భూములు తిరిగి అసైనీలకు అన్ని హక్కులతో పునరుద్ధరిస్తామన్నారు. ఇంతవరకు ఒక్క ఎకరం కూడా ఇవ్వలేదు? ఈ మోసం చాలదన్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం లగచర్లలో పేదల భూములు ఎందుకు లాక్కున్నది? అడవిని నమ్ముకుని పోడు చేసుకుని బతికే ఆదివాసుల భూములు ఎందుకు లాక్కుంటుంది? కాంగ్రెస్ పార్టీ అటవీ హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి, అర్హులైన వారందరికీ పోడు పట్టాలు ఇస్తామంది.ఇప్పటి వరకు ఒక్క గుంట పోడు భూమికి అయినా పట్టా ఇచ్చారా? ఒక్క ఆదివాసి కుటుంబానికైనా పట్టా పాస్ బుక్ ఇచ్చారా? ఇవ్వలేదు. టైగర్ కారిడార్ పేరుతో అటవీ హక్కుల చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 49 తీసుకొచ్చి ఉల్లంఘించడం లేదా? ప్రతి గూడెం, తండా పంచాయతీలకు ఏటా 25 లక్షలు కేటాయిస్తామన్నారు. ఎన్ని గూడాలకు, తండాలకు రెండేళ్ల కాలంలో 25 లక్షలు అందించారు? అసలు గ్రామ పంచాయితీ ఎన్నికలు కూడా జరపకుండాతండాలు,గూడాలను అభివృద్ధికి దూరంగా నెట్టేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? దీని మీద వివరణ ఇవ్వండి అని ఆర్ఎస్పీ అడిగారు.మాల, మాదిగ, ఇతర ఉపకులాలకు మొత్తం 3 కార్పోరేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఏడాదికి ఒక్కో కార్పోరేషన్‌కు 750 కోట్ల నిధులు మంజూరు చేస్తామన్నారు. రెండేళ్లలో 3 కార్పోరేషన్లకు కలిపి రూ. 4500 కోట్లు రావాలి. ఏవి? ఎందుకు ఇవ్వలేదు? కార్పోరేషన్ల ఏర్పాటు ఎందుకు చేయలేదు? తుకారాం ఆదివాసీ కార్పోరేషన్, సేవాలాల్ లంబాడా, ఎరుకల కార్పోరేషన్ ఏర్పాటు చేసి ఒక్కో కార్పోరేషన్‌కు ఏటా 500 కోట్లు ఇస్తామన్న ప్రభుత్వం. రెండేళ్లలో 3000 కోట్లు మంజూరు చేయాలి. చేశారా? కనీసం కార్పోరేషన్లు ఏర్పాటు చేశారా? ఎస్టీల అభివృద్ధి పట్ల మీ రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉందా? అని ఆర్ఎస్పీ నిలదీశారు.నల్గొండ, మహబూబాబాద్, ఖమ్మం, మహబూబ్ నగర్, నిజామాబాద్‌లో 5 కొత్తగా ఐటిడిఎలు ఏర్పాటు చేసి, మొత్తం 9 ఐటిడిఏల్లో సూపర్ స్పెషాలిటీ దవాఖానలు ఏర్పాటు చేస్తామన్నారు. ఏమీ చేయలేక పోయారు? విద్యా జ్యోతి పథకం కిందఎస్సీ ఎస్టీ విద్యార్థులు 10 పాసైతే 10 వేలు, ఇంటర్ పాసైతే 15 వేలు, డిగ్రీ పాసైతే 25 వేలు, పీజీ పాసైతే లక్ష రూపాయలుఎంఫిల్, పిహెచ్‌డీ పూర్తి చేస్తే 5 లక్షలు ఇస్తామన్నారు. కనీసం 10 రూపాయలు అయినా ఇవ్వలేక పోయారు ? ఎందుకని?? అని ప్రశ్నించారు.ప్రతి మండలంలో గురుకులం ఉండేలా, ఎస్సీ ఎస్టీ గురుకులం ఏర్పాటు. ఫీజు రియంబర్స్‌మెంట్ పథకం తిరిగి ప్రవేశపెట్టడంతో పాటు డిగ్రీ, పిజి చదివే ఎస్సీ ఎస్టీలందరికీ హాస్టల్ సదుపాయం. విదేశీ యూనివర్సిటీల్లో అడ్మిషన్ పొందిన ప్రతి ఎస్సీ ఎస్టీ విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. ఇందులో ఒక్క పైసా ప్రగతి లేదు, ఎందుకని? ఎస్సీ ఎస్టీలకు మాయమాటలు చెప్పి నిండా ముంచింది కాంగ్రెస్ పార్టీ. మోసపు హామీలు, బూటకపు మాటలకు ప్రత్యక్ష సాక్ష్యం మీరే మల్లికార్జున ఖర్గే గారు. ఎస్సీ ఎస్టీలను ఇంత ఘోరంగా దగా చేసి ఇంకా ఏ ముఖం పెట్టుకుని మా తెలంగాణకు వచ్చారు? రేవంత్ రెడ్డితో కుమ్మక్కై మళ్లీ కొత్తగా ఏ మోసం చేయబోతున్నారు? అని మల్లికార్జున్ ఖర్గేను ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిలదీశారు.


## బీఆర్ఎస్- కాంగ్రెస్ హై కమాండ్స్ ఎప్పుడో ములాఖత్ అయ్యాయి

హైదరాబాద్,కాంగ్రెస్ సభ సామాజిక అన్యాయ సభ అని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు. జైభీం, జైబాపు, జైసంవిధాన స్ఫూర్తినీ హత్య చేసింది కాంగ్రెస్..గాంధీ పేరును కూడా కబ్జా చేసి నెహ్రూ వంశం డూప్లికేట్ గాంధీలు అయ్యారు.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ను జీవితాంతం క్షోభ పెట్టింది కాంగ్రెస్.. వారి అకాల మరణానికి కారణం కాంగ్రెస్, రాజకీయంగా ఆయన్ను హత్య చేసింది అన్నారు. అసైన్డ్ భూములు లాక్కునే ప్రయత్నం చేసింది కాంగ్రెస్.. సంవిధాన్ పై మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ కు లేదని పేర్కొన్నారు. రాజ్యాంగ ప్రవేశికను మార్చిన దుష్ట చరిత్ర కాంగ్రెస్ పార్టీది.. ఇప్పుడున్నది ఇందిరా గాంధీది కాంగ్రెస్.. స్థానిక ఎన్నికలు నిర్వహించకుండా రాజ్యాంగాన్ని ఉల్లంఘించింది కాంగ్రెస్.. సిగ్గు శరం లేకుండా పుస్తకాన్ని పట్టుకుని ఓట్ల కోసం రాజకీయం చేస్తున్నది అని బూర నర్సయ్య గౌడ్ మండిపడ్డారు.ఇక, ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రాజ్యాంగ స్ఫూర్తినీ బొంద పెట్టింది కాంగ్రెస్ పార్టీ అని మాజీ ఎంపీ బూర నర్సయ్య తెలిపారు. నెహ్రూ మునిమనవడు గాంధీ ఎలా అవుతాడు.. ఈ సంకరజాతి ఎలా పుట్టుకువచ్చిందోనని ఆరోపించారు. రాహుల్ గాంధీ విదేశీ గడ్డ మీద భారత దేశాన్ని కించపరచడం ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు.. ఆయన ప్రజా స్వామ్య ద్రోహి.. వ్యవస్థల మీద నమ్మకం లేక పోతే లోక్ సభలో కూర్చునే అర్హత నీకు లేదు అని విమర్శించారు. ఆయన నిఖార్సయిన భారత ద్రోహి.. కాంగ్రెస్ పార్టీలో సామాజిక న్యాయం ఎక్కడ ఉ



ంది.. 42 శాతం రిజర్వేషన్ బీసీలకు కల్పిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. పార్టీ పదవుల్లో ఎవడికి కావాలి.. పిల్లల్ని నేను కంటా పెంచి పోషించాల్సింది పక్కింటి వాడు అన్నట్టుగా ఉంది కాంగ్రెస్ తీరు.. అలాగే, రేవంత్ రెడ్డి డిమాలిషన్ మాన్, ఇపుడు డైవర్షన్ మాన్ అని పేర్కొన్నారు. ఓఆర్ఆర్ లీజుపై రేవంత్ ఎన్నో మాట్లాడారు.. ఇపుడు ఏమీ చేయడం లేదన్నారు. బీఆర్ఎస్– కాంగ్రెస్ హై కమాండ్స్ ఎప్పుడో ములాఖత్ అయ్యాయని ఆరోపించారు. కుటుంబ పార్టీలకి కాకుండా బీజేపీకి ఓటు వేయాలని బూర నర్సయ్య గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## శ్రీ కృష్ణ జన్మభూమి- షాహి ఈద్గా కేసులో హిందూ పక్షానికి ఎదురుదెబ్బ..



మధుర:మధురలోని శ్రీ కృష్ణ జన్మభూమి– షాహి ఈద్గా వివాదం కేసులో హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. హిందూ పక్షం దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది.మసీదును వివాదాస్పద నిర్మాణంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. ఈ నిర్ణయం హిందూ పక్షానికి ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు పేర్కొంది.శ్రీ కృష్ణుడి జన్మస్థలంలో ఉన్న చాలా పురాతనమైన ఆలయాన్ని కూల్చివేసి ఈద్గా నిర్మించారని హిందూ పక్ష న్యాయవాది వాదించారు. ప్రస్తుతం ఉన్న వాస్తవాలు, పిటిషన్ ఆధారంగా, మధురలోని షాహి ఈద్గాను ప్రస్తుతం వివాదాస్పద నిర్మాణంగా ప్రకటించలేమని అలహాబాద్ హైకోర్టు పేర్కొంది. ఈ కేసుపై హిందువుల తరపు న్యాయవాది మహేంద్ర ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ.. మధురలోని షాహి ఇద్గా మసీదును వివాదాస్పద నిర్మాణంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మార్చి 5, 2025న హైకోర్టులో దరఖాస్తు దాఖలైందని చెప్పారు. దీనిపై మే 23న కోర్టులో చర్చ పూర్తయిందని.. కోర్టు తన నిర్ణయాన్ని రిజర్వ్ చేయగా.. నేడు తీర్పు వెలువరించిందని వెల్లడించారు..హిందూ సంఘాల అభిప్రాయం ప్రకారం.. ప్రస్తుతం మజీద్ ఉన్న ప్రదేశంలో ఆలయం ఉండేది. ఇప్పటి వరకు.. మసీదు ఉనికికి సంబంధించిన ఎటువంటి ఆధారాలను సమర్పించలేకపోయారు. అటువంటి పరిస్థితిలో దానిని మజీద్ కాకుండా.. వివాదాస్పద నిర్మాణంగా ప్రకటించాలి. అయోధ్య కేసులో కోర్టు తన నిర్ణయం ఇచ్చే ముందు బాబ్రీ మసీదును వివాదాస్పద నిర్మాణంగా ప్రకటించినట్లే..

## సంపాదకీయం

శనివారం 05-07-2025

# పరిశ్రమల్లో ఎమర్జెన్సీ సేఫ్టీ ఆడిట్ జరగాలి

పారిశ్రామిక వాడల్లో ప్రమాదాలు కలవరపెడుతున్నాయి. ఇది ఒక్క పాశమైలారం గురించే కాదు... దేశమంతా ఇదే దుస్థితి నెలకొంది. ప్రధానంగా ప్రమాదం జరిగినప్పుడు హడావిడి చేస్తున్న ప్రభుత్వం, అధికారులు వ్యవహారం సద్దుమణిగాక పట్టించుకోవడం లేదు. ఎందుకంటే ప్రమాదాల్లో ఎంతమంది మరణించారో కూడా లెక్కలు తెలియడం లేదు. సరికదా తెలుసుకునే ప్రయత్నాలు చేయడం లేదు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం గురించి నిత్యం పల్లవేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా భారీ పరిశ్రమలన్నింటిలో రెగ్యులర్‌గా సేఫ్టీ ఆడిట్ చేయించాలి. పని పరిస్థితులను మెరుగుపరచాలి. పారిశ్రామిక ప్రమాదాలు తరచూ జరిగే పారిశ్రామిక వాడలు ఉన్న ప్రాంతాల్లో వంద పడకల బర్న్ వార్డులతో కూడిన ఆసుపత్రులు నిర్మించాలి. ప్రతి నెలా అన్ని పరిశ్రమల్లోనూ తనిఖీలు నిర్వహించి, భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని అనుసరించేలా ఒత్తిడి తేవాలి. ఇప్పటికే పాశమైలారంనకు సంబంధించి అనేకమంది బాధితులు ఆస్పత్రి ముందు వచ్చి రోదిస్తున్నా..స్పందించడం లేదు. మావారు ఏమయ్యారనే ప్రశ్నలకు సమాధానం రావడం లేదు. ప్రమాదం జరిగిన సోమవారం నాడు పరిశ్రమలోకి ఎంతమంది వెళ్లారనడానికి సరైన లెక్కలు లేవు. దీనికి కూడా కారణం ఉంది. మనుషులతో పాటు, రికార్డులు కూడా బుగ్గికావడమే ఇందుకు నిదర్శనం. తెలంగాణ చరిత్రలోనే అతి పెద్ద పారిశ్రామిక ప్రమాదంగా సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ దుర్ఘటన నిలిచిపోయింది. ఇప్పటికి 40 మంది కార్మికులు మరణించగా, మరో 37 మంది తీవ్రంగా గాయపడినట్టు గుర్తించారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న 147 మందిలో మిగిలిన వారి కోసం రెండు రోజులుగా గాలింపు కొనసాగుతూనే ఉంది. కొందరి గుర్తింపు భారంగా మారింది. డీఎన్ఏ టెస్టులు కూడా కష్టంగానే మారాయి. బూడిదకుప్పల నుంచి డీఎన్ఏ టెస్టు చేయడం సాధ్యం కావడం లేదని సమాచారం. ఇకపోతే ఉద్యోగానికి వెళ్లిన వారెంతమంది అన్నది ప్రాథమికంగా తేల్చాలి. అప్పుడే ఎంతమంది చనిపోయారన్నది తెలుస్తుంది. ఎందుకంటే నిన్నటిదాకా ఉద్యోగానికి వెళ్లిన కార్మికులు బూడిద కుప్పలుగా మారారు. డీఎన్ఏ ఆధారంగా వారి అవశేషాలను గుర్తించాల్సిన దుస్థితి కనిపిస్తోంది. ఎందుకంటే తమవారు ఏరీ అని అడిగే వారి కుటుంబాలకు సమాధానం చెప్పుకోలేని దుస్థితిలో ప్రభుత్వం, అధికారులు, సంస్థ ప్రతినిధులు ఉన్నారు. కార్మికుల భద్రతను గాలికి వదిలేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకమే హైదరాబాద్ శివారు ఔషధ పరిశ్రమలో చోటు చేసుకున్న భారీ విస్ఫోటనంగా చెప్పుకోవాలి. హైదరాబాద్ శివారులోని పరిశ్రమల్లోనే గత రెండు మూడు నెలల్లో నాలుగైదు ప్రమాదాలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ కూడా అందుకు మినహాయింపు ఏమీ కాదు. విశాఖలో 2020 నాటి ఎల్‌జీ పాలిమర్స్ ప్రమాదం 12 మంది కార్మికులను బలిగొంటే, చుట్టుపక్కల ప్రాంతాలన్నింటినీ విషతుల్యంగా మార్చి, వందలమందిని ఆసుపత్రుల పాలు చేసింది. ఆ తరువాత అచ్యుతాపురం సెజ్‌లో 2022 జూన్, ఆగస్టుల్లో 500 మందికిపైగా మహిళలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆ ప్రమాదంపై నివేదిక అమలు మాట అటుంచి వెలుగుచూసిన పాపానే పోలేదు. గత ఏడాది అచ్యుతాపురం సెజ్ ఎసెన్షియా ఫార్మాలో 17 మంది మరణించగా, 38 మంది గాయపడ్డారు. ఈ ఏడాది ఆరు నెలల్లోనే అనకాపల్లి జిల్లాలో జరిగిన 11 ప్రమాదాల్లో ఐదుగురు మరణించగా, ఎనిమిదిమంది తీవ్ర గాయాలతో మంచంపట్టారు. పరవాడ ఫార్మాసిటీలో గత ఏడాది విషవాయువుల లీకేజీసహా పలు ప్రమాదాల్లో 10 మంది మరణించగా, 40 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రాణాలకు తెగించి ప్రాణాంతక పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల పక్షాన నిలవకుండా, లాభం కోసం భద్రతను గాలికొదిలేసి ప్రాణాలను బలిగొంటున్న పరిశ్రమల అధిపతుల పక్షాన కేంద్ర, రాష్ట్ర పాలకులు నిలవడం మరింత విషాదం. దేశవ్యాప్తంగా పారిశ్రామిక ప్రమాదాల్లో రోజూ కనీసం ముగ్గురు కార్మికులు మరణిస్తున్నారు. తనిఖీలను తగ్గించి, స్వీయ ధ్రువీకరణలను అనుమతించడం ద్వారా భద్రతావసరమైన నియంత్రణలను బలహీనపరచడమే భారీ ప్రమాదాలకు కారణమన్న అంతర్జాతీయ కార్మిక సంస్థ హెచ్చరికలను ఇప్పటికైనా గుర్తించి, కఠిన చర్యలకు ఉపక్రమించాలి. యాజమాన్యాల అత్యాశతో రసాయన, ఔషధ పరిశ్రమలుసహా వివిధ పరిశ్రమల్లో అత్యంత కీలకమైన స్థానాల్లో అతి తక్కువ వేతనాలకు పనిచేసే తగిన నైపుణ్యం, విద్యార్హత లేని వారిని, ఇతర రాష్ట్రాల వారిని కాంట్రాక్ట్, డైలీవేజ్ ప్రాతిపదికన నియమిస్తున్నాయి. కాలం చెల్లిన రియాక్టర్లు, యంత్రాలను వినియోగించడం తోపాటు వాటికి దగ్గరగా వెల్డింగ్, సోల్డరింగ్ చేయడం, యంత్రాలు, వాల్వులపై పర్యవేక్షణ లేకపోవడం, సిబ్బందికి భద్రతాపరమైన పరికరాలు, తగిన శిక్షణ ఇవ్వకపోవడం, భద్రతా తనిఖీలు జరగకపోవడం వల్ల రసాయనాలను దగ్గరగా నిల్వచేయడం తదితర కారణాల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలు నివేదికలు ఘోషిస్తున్నాయి. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చేసి, తమకు జరిగిన అన్యాయాన్ని,యాజమాన్యాల దుర్మార్గాన్ని ప్రశ్నించలేని స్థితికి కార్మికులను నెట్టేసిన తీరు పాలకుల నిరంకుశ విధానాలకు నిదర్శనం గా చూడాలి. కార్పొరేట్లకు కొమ్ముకాయడం మాని, సేఫ్టీ వర్క్ లాంటి కార్మిక అనుకూల నినాదాలను తీసుకోవడం తక్షణ అవసరం. కార్మికుల సంక్షేమం ద్వారానే సంస్థల బలపడాలి తప్ప, కార్మికులను పొట్టన పెట్టుకుని ముందుకు సాగాలన్న ఆలోచనలకు పాతరేయాలి. ముందుగా తెలంగాణ, ఏపిల్లో ఉన్న పారిశ్రామిక వాడల్లో ఎమర్జెన్సీ సేఫ్టీ ఆడిటింగ్ చేపట్టాలి. ఆయా పరిశ్రమల్లో నాణ్యతాపరమైన, భద్రతాపరమైన ఏర్పాట్లు ఉన్నాయా లేదా అన్నది విశ్లేషించాలి. అప్పుడే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయగలం.

# దక్షిణాసియాలో ఏకాకిగా భారత్!



న్యూఢిల్లీ,నరేంద్ర మోడీ 2014లో ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే సమయంలో దక్షిణాసియా దేశాల అధినేతలను ఆహ్వానించడం ద్వారా తన విదేశాంగ విధానంలో దక్షిణాసియాకు ప్రధాన ప్రాధాన్యత ఇస్తున్న సంకేతాన్ని ఇచ్చారు. ఆ తర్వాత పాకిస్తాన్ ప్రధాని నవాజ్ షరీఫ్ తల్లి జన్మదినానికి నాటకీయంగా హాజరవడం ద్వారా చెప్పుకోదగిన చొరవ చూపుతున్న సంకేతం ఇచ్చారు. అయితే ఆ తర్వాత గత పదేళ్లలో దాదాపు అన్ని దక్షిణాసియా దేశాలు భారత్‌కు దూరంగా జరుగుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. వ్యూహాత్మకంగా వాటితో చైనా సంబంధాలను మెరుగుపరుచుకోగలుగుతుంది. ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని గర్వంగా చెప్పుకుంటున్న భారత్ అంతర్జాతీయ రాజకీయ వేదికపై నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని కోరుకుంటోంది.'భారతదేశం సాంకేతిక పరిజ్ఞానం వివిధ అంశాలలో ప్రపంచ నాయకుడిగా ఎదుగుతోంది. అది అంతరిక్షం, కృత్రిమ మేధస్సు, డిజిటల్ ఆవిష్కరణ, గ్రీన్ టెక్నాలజీ, మరిన్ని కావచ్చు' అని ప్రధాని మోడీ గత నెలలో ఎక్స్‌లో పేర్కొన్నారు. అయితే అంతర్జాతీయంగా, దౌత్యపరంగా భారత్ ఎదుర్కొంటున్న సవాళ్ళను అటుంచితే పొరుగువారితో సంబంధాలు మాత్రం ఆందోళనకరంగా ఉన్నాయని మరచిపోలేము. ఆర్థిక అస్థిరత, రాజకీయ దుర్బలత్వం ఎదుర్కొంటున్న దక్షిణాసియా దేశాలను ప్రభావితం చేయగల స్థితిలో భారత్ ఉన్నప్పటికీ పరిణామాలు భిన్నంగా మారుతున్నాయి. తాలిబన్లు తిరిగి అధికారంలోకి వచ్చినప్పటి నుండి అఫ్ఘానిస్తాన్ జనాభాలో సగానికి పైగా దారిద్ర్యరేఖకు దిగువకు పడిపోయారు. సైనిక పాలనలో రాజకీయ అస్థిరతతో మయన్మార్ పోరాడుతోంది. పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ బెయిలౌట్‌ల కోసం అంతర్జాతీయ ద్రవ్యనిధిని ఆశ్రయించాయి. మరోవంక, చైనా ఆర్థిక, వ్యూహాత్మక భాగస్వామ్యాలను పెంచుకోవడం ద్వారా దక్షిణాసియా అంతటా తన ప్రభావాన్ని విస్తరిస్తోంది. చైనా ప్రాబల్యం ఈ ప్రాంతంలో పెరగడానికి భారత్ నిర్లక్ష్యపూరిత విదేశాంగ విధానమే కొంతవరకు సహకరించినట్లు దౌత్యనిపుణులు భావిస్తున్నారు. ప్రాంతీయ సంఘీభావానికి మాటలలో ఆసక్తి కనబరుస్తూ వస్తున్నప్పటికీ, భారతదేశ విదేశాంగ విధానం ప్రధానంగా దక్షిణాసియా కంటే అమెరికా, ఐరోపా, తూర్పు ఐరోపా వైపు దృష్టి సారించిందని స్పష్టం చేస్తున్నారు. అఫ్ఘానిస్తాన్, బంగ్లాదేశ్, భూటాన్, భారతదేశం, మాల్దీవులు, నేపాల్, పాకిస్తాన్, శ్రీలంకలతో కూడిన ప్రాంతీయ కూటమి అయిన దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంఘం (సార్క్) భారత్ అనాసక్తి కారణంగానే మూతపడిన్నట్లు గుర్తు చేస్తున్నారు. సార్క్‌ను పునరుద్ధరించాలని అన్ని దేశాలు కోరుకొంటున్నా భారత్ నిరాసక్తత కారణంగానే ఇపుడు సాధ్యపడటం లేదు. దానితో చైనా, పాకిస్తాన్ కలిసి దేనికి పోటీగా అంటారో ప్రాంతీయ కూటమి ఏర్పాటుకు ప్రయత్నించడం గమనార్హం. అఫ్ఘానిస్తాన్‌లో తాలిబన్ల ప్రభుత్వాన్ని భారత్ అధికారికంగా ఇంకా గుర్తించకపోయినప్పటికీ పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఆ దాడిని ఖండించిన ఏకైక దేశం ఈ ప్రాంతంలో అదే కావడం తెలిసిందే. అందుకు కృతజ్ఞతగా భారత్ విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ మొదటిసారిగా ఆ దేశం విదేశాంగ మంత్రికి ఫోన్ చేసి మాట్లాడారు. పాకిస్తాన్‌తో ఆ దేశం ఎదుర్కొంటున్న సమస్యల దృష్ట్యా రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడగలవని భావిస్తున్న తరుణంలో చైనా, అఫ్ఘానిస్తాన్, పాకిస్తాన్ కలిసి ఉమ్మడి ప్రకటన చేశాయి. భారతదేశం తరచుగా ప్రాంతీయ సమస్యలపై ఏకపక్ష విధానాన్ని అవలంబిస్తూ ఉండడం కూడా ఏకాకిగా మిగలడానికి ఓ కారణం అని విదేశీ నిపుణులు చెబుతున్నారు. 2014లో సార్క్ ఉపగ్రహ ప్రయోగాన్ని ఉటంకిస్తూ ప్రధాని మోడీ 'ప్రాంతీయ సంప్రదింపులను దాటవేసారు' అని విమర్శలు చెలరేగుతున్నాయి. భారత్ 'ఏకపక్ష విధానాలు' పాకిస్తాన్‌ను మరింత దూరంగా నెట్టివేయడంతోపాటు నేపాల్, శ్రీలంక వంటి దేశాలతో సైతం దూరం పెంచుతున్నాయనే అభిప్రాయం బలపడుతున్నది. వాటిని చైనా వైపు మొగ్గే విధంగా చేస్తున్నాయి. బంగ్లాదేశ్ విశ్వసనీయమైన మిత్రదేశం అయినప్పటికీ ఆ దేశంలో అధికారంలో ఉన్న షేక్ హసీనా, ఆమె పార్టీతో మినహా ఇతర రాజకీయ పార్టీలు, వర్గాలతో ఎటువంటి సంబంధాలు ఏర్పాటు చేసుకోకపోవడంతో అక్కడ రాజకీయ సంక్షోభం నెలకొన్న సమయంలో దాదాపు నిస్సహాయంగా మిగలాల్సి వచ్చింది. అంతటి రాజకీయ సంక్షోభం వైపు ఆ దేశం వెడుతుంటే మన నిఘా, దౌత్యవర్గాలు ప్రభుత్వానికి ఎటువంటి సంకేతం ఇవ్వలేకపోవడంతో దారుణమైన పరిస్థితులు ఎదుర్కొన్నాం. వ్యూహాత్మకంగా తన ప్రపంచీకరణ అభిలాషలను చైనా ప్రాంతీయకరించడం, అందుకు విరుద్ధంగా భారత్ తన ప్రాంతీయ ప్రయోజనాలను ప్రపంచీకరణ కావించడం జరుగుతున్నది. ప్రపంచ బ్యాంకు ప్రకారం, దక్షిణాసియా ఇప్పుడు ప్రపంచంలో ఆర్థికంగా అతి తక్కువ సమగ్ర ప్రాంతంగా, విస్తృతంగా పరిగణించబడుతున్నది. ఈ ప్రాంతంలో మొత్తం వాణిజ్యంలో అంతర్ -ప్రాంతీయ వాణిజ్యం కేవలం 5 శాతం మాత్రమే. దీనికి విరుద్ధంగా, అంతర్గత ఐరోపా యూనియన్ వాణిజ్యం దాదాపు 60 శాతం వద్ద ఉంది. అంతర్జాతీయ వ్యవహారాలలో దక్షిణాసియా ప్రాధాన్యత కుంచించుకు పోవడం నేరుగా భారత్ ప్రాబల్యంపై పడుతుంది. దక్షిణాసియాలో భారతదేశం వెలుపల 500 మిలియన్ల మంది ప్రజల బలమైన మార్కెట్ ఉందని మరచిపోతున్నాం. వస్త్రాలు, ఔషధాలు, ఇంధనం, సేవల రంగాలలో ఈ ప్రాంతానికి చెప్పుకోదగిన సామర్థ్యం ఉంది. ఈ ప్రాంతంలో వాణిజ్యం ద్వారా విశేషంగా ప్రయోజనం పొందే అవకాశాలు ఉన్నప్పటికీ రాజకీయ అంశాలు అవరోధంగా మారుతున్నాయి. భారతదేశం తన సరిహద్దుల వెంబడి సన్నిహిత సంబంధాలను పెంపొందించుకోవడం ఆర్థికంగా పరిపుష్టి అయ్యేందుకు మరింతగా దోహదపడుతుందని మరచిపోలేం. 'భారతదేశం తన పొరుగు ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేస్తే, అది చైనా వంటి ఇతరులను పొరుగు ప్రాంతంలోకి ప్రవేశించడానికి అనుమతిస్తుంది. అది భారతదేశ జాతీయ భద్రతను రాజీ చేస్తుంది' అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దౌత్యపరమైన వైరుధ్యాల తరువాత పాకిస్తాన్‌తో భారతదేశ వాణిజ్యం కుప్పకూలింది. స్థిరత్వాన్ని పెంపొందించే ఆర్థిక సంబంధాలను ఇరువైపులా కోల్పోయింది. బంగ్లాదేశ్ ఓడరేవులు, శ్రీలంక విమానాశ్రయాలు, పాకిస్తాన్ మోటార్ వేలలో పెట్టుబడులు పెట్టడం ద్వారా చైనా ఇప్పటికే దక్షిణాసియాలో విశేషంగా ప్రయోజనాలు పొందుతున్నది. కారణాలు ఏవైనప్పటికీ పొరుగుదేశాల విశ్వాసం పొందే విధంగా భారత్ దౌత్యవిధానాలు ఉండటం లేదని విమర్శలు తరచూ చెలరేగుతున్నాయి. 'దక్షిణాసియాలోని మిగిలిన ప్రాంతాలు లొంగిపోవాలని అది కోరుకుంటుంది' అని శ్రీలంకకు చెందిన ఓ ఆర్థికవేత్త దారుణమైన అభిప్రాయం వ్యక్తం చేశారు. 'భారతదేశం ప్రపంచ వేదికపై బాగా రాణించాలంటే, ఒకరిపై ఒకరు సార్వభౌమ సంబంధాన్ని అంగీకరించడం ద్వారా దాని పొరుగువారితో శాంతిని నెలకొల్పాలి' అంటూ హితవు చెప్పారు. గతంలో, స్వల్పకాలిక భౌగోళిక, రాజకీయ ప్రయోజనాల కోసం భారతదేశం దీర్ఘకాలిక ప్రాంతీయ సహకారాన్ని త్యాగం చేసింది. ఇరాన్- పాకిస్తాన్- భారత్ గ్యాస్ పైప్‌లైన్‌ను ఉదాహరణగా పేర్కొనవచ్చు. అమెరికా ఒత్తిడి కారణంగా మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ హయాంలో దీనిని రద్దు చేశారు. ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చి ఉంటే గ్యాస్ ప్రవహిస్తూ ఆర్థికంగా ప్రయోజనం పొందటమే కాకుండా దౌత్య సంబంధాలతోపాటు ఈ ప్రాంతంలో శాంతి నెలకొనేందుకు కొంతమేరకు దోహదపడేదని పరిశీలకులు భావిస్తున్నారు. భారతదేశం దృష్టి దక్షిణాసియాకు అవతలి వైపు ఇండో- పసిఫిక్ వైపు మళ్లింది. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, భారతదేశంతో కూడిన క్వాడ్ కూటమిలో చేరడం ద్వారా పశ్చిమ దేశాలతో స్నేహంకోసం ప్రాధాన్యత ఇచ్చాం. అయితే, భారతదేశం స్థిరంగా ఉండాలంటే, దాని సరిహద్దులు స్థిరంగా ఉండాలి. క్వాడ్ పరోక్షంగా చైనా వ్యతిరేక సైనిక కూటమిగా మారడంతో చైనాతో సంబంధాలలో ప్రతిష్టంభనకు, ముఖ్యంగా గాల్వన్ లోయలో ఘర్షణలకు దారితీసింది. రాజీవ్ గాంధీ చైనాతో సరిహద్దు ఒప్పందం చేసుకున్న తర్వాత సరిహద్దుల్లో కాల్పులు జరగడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. మరోవంక, తూర్పు ఆసియా దేశాలతో భారత్ సంబంధాల కారణంగానే బంగ్లాదేశ్, మయాన్మార్‌లలో అస్థిర రాజకీయ పరిస్థితులలో భారత్‌పట్ల అనుమానంగా చూస్తున్నారనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఐరాస భద్రత మండలిలో వీటో అధికారం పొందడంతోపాటు భారత్ వ్యక్తం చేస్తున్న

# వీసా విద్యార్థులకు మరో గండం

వాషింగ్టన్,అమెరికాలో చదువుల కోసం ప్రయత్నిస్తున్న విద్యార్థులకు అగ్రరాజ్యం మరో షాక్ ఇవ్వబోతోంది. అగ్రరాజ్యంలో ఉంటున్న విదేశీ విద్యార్థులపై మరో ఆంక్షల కత్తి వేలాడుతోంది. ఇప్పటికే వీసాల జారీకి 'సోషల్ మీడియా వెట్టింగ్'ను కఠినంగా అమలుచేస్తోన్న అగ్రరాజ్యం.. తాజాగా మరో మార్పు తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. విద్యార్థి వీసాలకూ పరిమిత కాల గడువు విధించేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రతిపాదనలు చేసింది. దీంతో విదేశీ విద్యార్థులకు కొత్త గుబులు పట్టుకుంది. దీనిప్రకారం చదువుకునే సమయం వరకే వీసా అనుమతులు ఉండనున్నాయి. ఈ ప్రతిపాదన లపై న్యాయనిపుణులు, విద్యార్థుల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ మార్పుల వల్ల విద్యార్థులపై అదనపు భారం పడుతుందని, అనవసరపు గందరగోళానికి దారితీస్తుందని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాగా.. ఈ మార్పులు అమల్లోకి వస్తే భారతీయ విద్యార్థులపై అధిక ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రస్తుతం 3.3లక్షల మందికి పైగా భారతీయులు అమెరికా వర్సిటీల్లో చదువుకుంటున్నారు. ప్రస్తుతం ఎఫ్-1 వీసాలపై అమెరికాలో ఉన్న అంతర్జాతీయ విద్యార్థులు, జే-1 వీసాలపై వచ్చిన ఎక్స్ఛేంజ్ విజిటర్లకు 'డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్' వెసులుబాటు ఉంది. అంటే.. వారు ఎంతకాలం చదవాలనుకుంటే లేదా ఇంటర్న్ ప్రోగ్రామ్‌లో పాల్గొనాలనుకుంటే.. అంతకాలం అగ్రరాజ్యంలో ఉండే ఛాన్స్ ఇంతవరకు ఉంది. . ఎక్స్ఛేంజ్ విజిటర్స్‌గా వచ్చే విద్యార్థులు, ప్రొఫెసర్లు, స్కాలర్లు, స్పెషలిస్టులు, ట్రైనీలు, ఇంటర్న్‌లు, ఫిజీషియన్లకు కూడా ఈ సదుపాయం వర్తిస్తుంది. అయితే, ఈ ఫ్లెక్సిబుల్ స్టూడెంట్ వీసా సిస్టమ్‌లో మార్పులు తీసుకొచ్చేందుకు ఇప్పుడు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ విభాగం సిద్ధమైంది. విద్యార్థి వీసాలకు కూడా గడువు విధించేలా 'పరిమిత కాల నివాస అనుమతి'తో కూడిన వీసాలను మంజూరుచేయాలని ప్రతిపాదించింది. అంటే, ఇకపై విద్యార్థి వీసాలకు కూడా టైం లిమిట్ విధించనున్నారు. దీంతో గడువు తీరిన తర్వాత వీసా పొడిగింపునకు విద్యార్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలను సమీక్షించేందుకు ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బ్జడెట్ విభాగానికి పంపించారు. అనంతరం దీన్ని ఫెడరల్ రిజిస్ట్రీలో పబ్లిష్ చేస్తారు. ఆ తర్వాత ప్రతిపాదనలపై 30 లేదా 60 రోజుల వరకు ప్రజాభిప్రాయాలను స్వీకరించి తుది నిర్ణయం తీసుకుంటారు. ప్రజల నుంచి ఎలాంటి అభిప్రాయాలు తీసుకోకుండానే తక్షణమే అమల్లోకి వచ్చేలా దీనిపై మధ్యంతర ఉత్తర్వులు కూడా జారీ చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

## అమెరికాలో అక్రమంగా ప్రవేశిస్తూ దొరికిపోయిన భారతీయులు

వాషింగ్టన్,అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తూ ఈ ఏడాది జనవరి నుంచి మే మధ్యలో 10,382 మంది భారతీయులు దొరికిపోయారు. వీరిలో పెద్దల రక్షణ లేని 30 మంది మైనర్లు కూడా ఉన్నారు. అక్రమంగా ప్రవేశించేందుకు యత్నించిన వారిలో కూడా అత్యధికంగా గుజరాత్ రాష్ట్రానిక చెందిన వారున్నారు. ఈ డేటాను అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విభాగం విడుదల చేసింది. ఇటీవల కాలంలో అమెరికా సరిహద్దుల్లో భద్రతా చర్యలు కట్టుదిట్టం కావడంతో అక్రమ వలసదారులను భారీ సంఖ్యలో అరెస్టులు చేస్తున్నారు. గతేడాది ఇదే సీజన్‌లో మొత్తం 34,535 మంది భారతీయులు అక్రమంగా చొరబడుతూ పట్టుబడ్డారు. ఈ లెక్కన ఈ ఏడాది సుమారు 70శాతం తగ్గుదల నమోదైంది. రోజుకు సగటున 69 మంది అరెస్ట్ అయ్యారు. ఇదే జోబైడెన్ హయాంలో రోజుకు 230 వరకు అరెస్ట్ అయ్యేవారు. ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత మానవ అక్రమ రవాణా ముఠాలు తమ కార్యకలాపాలను గణనీయంగా తగ్గించాయి. వాస్తవానికి అమెరికా ఎన్నికల్లో హారిస్ ఓటమి దాదాపు ఖాయం అనుకొన్న సమయం నుంచి ఈ ముఠాలు తమ కార్యకలాపాలను తగ్గించినట్లు ఓ ఆంగ్ల పత్రిక వెల్లడించింది. 2024 ఆర్థిక సంవత్సరంలో తల్లిదండ్రులు వదిలేసిన 500 మైనర్లను అధికారులు అదుపులోకి తీసుకొన్నారు. అమెరికా-మెక్సికో, అమెరికా-కెనడా సరిహద్దుల్లో చాలా మంది తమ పిల్లలకైనా అగ్రరాజ్య పౌరసత్వం వస్తుందన్న ఆశతో వారిని వదిలేసి వెళ్లేవారు. కానీ, ట్రంప్ అధికారం చేపట్టాక ఇలా పిల్లలను వదిలేయడంపై మరింత కఠినంగా వ్యవహరిస్తున్నారు. తరచూ ఇక్కడ అధికారులు గుర్తించే పిల్లల వయస్సు 12 నుంచి 17 ఏళ్ల మధ్యలో ఉంటోంది. చాలా అరుదుగా అంతకంటే చిన్నవారు ఉంటున్నారు. ఏప్రిల్ 2024 నాటికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ లెక్కల ప్రకారం అమెరికాలో 2.2 లక్షల మంది భారతీయులు ఎటువంటి పత్రాలు లేకుండా జీవిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి 332 మందిని అక్కడి నుంచి వెనక్కి పంపారు. భారతీయులు అక్రమ రవాణాదారుల మాటలు విని కఠిన మార్గాల్లో ప్రయాణించి అమెరికాలోకి ప్రవేశించాలనుకొంటారు. భారీ సరిహద్దు గోడ, కంచెలను తప్పించుకొనేందుకు ప్రమాదకరమైన సముద్ర మార్గాన్ని కూడా ఆశ్రయిస్తున్నారు. మే 9వ తేదీన ఇలా ప్రయాణిస్తూ కాలిఫోర్నియాలోని డెల్ మార్ సమీపంలో పడవ బోల్తాపడి భారత్ 14 ఏళ్ల బాలుడు, 10 ఏళ్ల బాలిక ప్రాణాలు కోల్పోయారు. వీరిద్దరూ అన్నా చె÷-లలెళు ..ఇలాంటి పడవలు తరచూ మెక్సికో తీరం నుంచి బయల్దేరి అమెరికాలో జలాల్లోకి చొరబడతాయి.

# శిద్దా ఫ్యామిలీ పొలిటికల్ గా ఇక తెరమరుగేనా?



అమరావతి,మాజీ మంత్రి శిద్దారాఘవరావు ఒకప్పుడు తెలుగుదేశంలో కీలక నేత. చంద్రబాబుకి సన్నిహితుడిగా పార్టీలో పలు కీలక పదవులు కూడా అనుభవించారు. కానీ తెలుగుదేశం 2019 ఎన్నికలలో అధికారం కోల్పోయిన తరువాత వైసీపీ గూటికి చేరారు. అయితే వైసీపీ ప్రభుత్వం ఆ మాజీ మంత్రిని పెద్దగా పట్టించుకున్న దాఖలులు లేవు. దీంతో ప్రస్తుతం ఆ పార్టీకి కూడా రాజీనామా చేసి ఏడాదిగా ఏ పార్టీలో చేరలేకపోతున్నారు. దాంతో ఆయనతో పాటు కుమారుడి పొలిటికల్ ఫ్యూచర్ కూడా డైలమాలో పడింది. మాజీ మంత్రి సిద్ధా రాఘవరావు ఫొలిటికల్ ఫ్యూచర్‌పై ప్రకాశం జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. తెలుగుదేశంలో కీలక నేతగా పలు పదవులను అలంకరించిన ఈ మాజీ మంత్రి ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో తెలియకుండా తయారయ్యారు. గడిచిన సంవత్సర కాలంగా రాజకీయాలకు దూరంగా ఉండాల్సి అనివార్య పరిస్థితిలో ఉన్నారు. ఒకప్పుడు తెలుగుదేశం పార్టీలో కీలక నేత గా గుర్తింపు తెచ్చుకున్న సిద్ధా రాఘవరావు రాజకీయ జీవితం డైలమాలో పడటానికి కారణం స్వయంకృతాపరాధమే అంటున్నారు. వ్యాపార వేత్తగా ఉన్న సిద్ధా రాఘవరావు 1999లో తెలుగుదేశంలో చేరగానే ఒంగోలు అసెంబ్లీ టికెట్ ఇచ్చి పోటీ చేయించారు. అయితే ఎన్నికల్లో శిద్దా పరాజయం పాలయ్యారు. అయినా శిద్దా రాఘవరావును శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా నియమించి చంద్రాబాబు సముచిత గౌరవం ఇచ్చారు. అనంతరం 2007లో ఎమ్మెల్సీగాను అవకాశం ఇచ్చారు. 2014 ఎన్నికల్లో దర్శి అసెంబ్లీ టికెట్ కేటాయించారు. అక్కడ విజయం సాధించిన రాఘవరావుకు తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రి పదవి ఇచ్చి కీలక శాఖలు కేటాయించారు. 2019 ఎన్నికల్లో ఒంగోలు ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన శిద్దా రాఘవరావు సైకిల్ దిగి ఫ్యాన్ గూటికి చేరారు. అయితే వైసీపీలో చేరిన శిద్దాకు అక్కడ కనీస ప్రాధాన్యత కూడా లభించలేదు. తెలుగుదేశంలో ఉన్నప్పుడు ఉమ్మడి జిల్లా అంతా తానై శాసించిన రాఘవరావుకు వైసీపీ లో ఎటువంటి గుర్తింపు ఇవ్వకపోగా.. 2024 ఎన్నికల్లో ఎక్కడా సీటు కూడా కేటాయించలేదు. ఎన్నికల అనంతరం వైసీపీకి రాజీనామా చేసిన శిద్ధా రాఘవరావు గడిసిన సంవత్సర కాలంగా ఏ పార్టీలో చేరకుండా ఉండి పోయారు. అయితే ఆయన అనుచరగణం మాత్రం ఆయన టీడీపీలోకి వస్తున్నారని ప్రచారం చేసుకుంటున్నారంట. మరో వర్గం మాత్రం కష్టకాలంలో పార్టీ వీడి పోయిన వారిని ఎవరినీ పార్టీలో చేర్చుకోవద్దని లోకేష్ చెప్పారని.. శిద్దా రాఘవరావు ను టీడీపీలో చేర్చుకునే ప్రసక్తే లేదని తెగేసి చెప్తున్నారు. జిల్లాలో మాత్రం టీడీపీలో ఉన్నప్పుడు ఒక వెలుగు వెలిగిన శిద్దా వైసీపీకి వెళ్ళి రాజకీయ జీవితాన్ని అంధకారంలోకి నెట్టుకున్నారన్న టాక్ నడుస్తోంది. రాఘవరావుతో పాటు ఆయన కుమారుడి రాజకీయ భవిష్యత్తు కూడా ఇప్పుడు ప్రశ్నార్థకం అయ్యిందట. శిద్దా రాఘవరావు తన కుమారుడిని కూడా రాజకీయాల్లోకి తీసుకువచ్చేందుకు బాగానే ప్రయత్నాలు చేశారంట. టీడీపీలో మంత్రిగా శిద్దా కొనసాగుతున్న సమయంలో ఆయన పోటీచేసి విజయం సాధించిన దర్శి నియోజకవర్గంలో సిద్ధా సుధీర్ పెత్తనమే కొనసాగింది. 2019 ఎన్నికల్లో తాను ఒంగోలు ఎంపీగా పోటీచేస్తూ తన కుమారుడికి దర్శి అసెంబ్లీకి పోటీ చేయించేందుకు చివరి వరకు ప్రయత్నం చేశారట. అయితే అనూహ్యంగా 2019 ఎన్నికల తర్వాత వ్యాపార వ్యవహారాల్లో వైసీపీ ప్రభుత్వం కల్పించిన చిక్కుల నుండి బయట పడేందుకు శిద్దా వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. తర్వాత వైసీపీకి రిజైన్ చేసి, టీడీపీలో చేరే అవకాశం లేకుండా పోయిన ఆయన ఇప్పుడు ఇంటికే పరిమితం అయ్యారు. దీంతో ఆయనతో పాటు సిద్దా సుధీర్ రాజకీయ భవిష్యత్ కూడా డోలాయమానంలో పడింది. 2014 నుండి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి నిత్యం ప్రజల్లో ఉన్న శిద్దా కుటుంబం ఇప్పుడు ఇంటికే పరిమితం కావటంతో సుధీర్ రాజకీయ భవిష్యత్తుపై నీలి నీడలు కమ్ముకున్నాయి. 2024 ఎన్నికల ముందు కూడా రాఘవరావుకు తెలుగుదేశంలో చేరే అవకాశం వచ్చిందట. అయితే అప్పట్లో ఆయన అప్పట్లో ససేమిరా అన్నారంట. చేజేతులా చేసుకున్న దానికి ఇప్పుడు అనుభవి స్తున్నారని టీడీపీ శ్రేణులు సెటైర్లు విసురుతున్నాయి.

# సరిదిద్దలేరా..!

తిరుపతి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకుంది. అందరూ కలిసి ఉండాలని.. నాయకులు కలివిడిగా ఉండాలని కూటమి పార్టీల అధినేతలైన చంద్రబాబు, జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ చెబుతున్నారు. అయితే.. క్షేత్రస్థాయిలో మాత్రం కూటమి కలివిడి నేత బీర చందంగానే మారింది. పైకి అందరూ బాగానే ఉన్నట్టు కనిపిస్తున్నారు. కానీ.. క్షేత్రస్థాయిలో మాత్రం ఉప్పు-నిప్పు తరహాలో వ్యవహరి స్తున్నారు. ఇలాంటి వాటిలో ప్రముఖ ఆధ్యాత్మిక నగరం తిరుపతి కూడా చేరిపోయింది. తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం గత ఎన్నికల్లో జనసేన ఖాతాలోకి చేరింది. ఆ పార్టీ నుంచి ఆరణి శ్రీనివాసులు విజయం దక్కించుకున్నారు. ఈయన వైసీపీ నుంచి వచ్చిన నాయకుడు. పైగా ఎన్నికలకు ముందు మాత్రమే జనసేన తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఆ పార్టీ నాయకులతో ఈయన కలివిడిగా ఉండలేకపోతున్నారు. ఇది జనసేనలో తరచుగా చర్చకు వస్తోంది. ఇక, టీడీపీలో ఉండి.. పనిచేసిన వారిలో కొందరికి మాత్రమే ఈ ఏడాది పదవులు దక్కాయి. మిగిలిన వారికి దక్కలేదు. తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ.. రాష్ట్ర బ్యాటిఫికేషన్ కార్పొరేషన్ చైర్ పర్సన్ పదవిని దక్కించుకున్నారు. కానీ, ఆమెతోపాటు పనిచేసిన కొందరికి మాత్రం ఎలాంటి పదవీ దక్కలేదు. దీంతో పార్టీలో యాక్టివ్ నెస్ తగ్గించారు. మరోవైపు.. జనసేనలో ఆది నుంచి కిరణ్ రాయల్ యాక్టివ్‌గా ఉన్నారు. ఇప్పటికీ.. ఆయన యాక్టివ్‌గానే ఉన్నారు. కానీ.. గత ఎన్నికల్లో ఏకంగా తనకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తారని అనుకున్నా.. అది దక్కలేదు. పోనీ ప్రభుత్వం ఏర్పడ్డాక.. అయినా తనకు న్యాయం జరుగుతుందని లెక్కలు వేసుకున్నారు. కానీ.. ఇదే జిల్లా నుంచి పసుపులేటి హరిప్రసాద్‌కు నామినేటెడ్ పదవి.. హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ పోస్టు దక్కింది. ఇది కిరణ్‌ను నిరుత్సాహ పరిచింది. ఇక, బీజేపీలో ఉన్న భాను ప్రకాష్‌కు చిట్టచివరి నిమిషంలో టీటీడీ బోర్డు మెంబర్ సీటు లభించింది.

# ఉగ్రవాదుల ఇంటి నుంచి కీలక వస్తువుల సేకరణ

రాయచోటి,అన్నమయ్య జిల్లా రాయచోటిలో 30 ఏళ్లుగా స్థావరాలు ఏర్పరచుకున్నఉగ్రవాదులను అరెస్ట్ చేశాక పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. వారి ఇళ్ల నుంచి పలు వస్తువులను, తీవ్రవాద సాహిత్యం, పేలుళ్లకు సంబంధించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే వీరిని అరెస్ట్ చేసిన పోలీసులు కేసులు నమోదు చేశారు. తమిళనాడులో జరిగిన వరుస బాంబు పేలుళ్ల కేసులో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న ఉగ్రవాదులు అబూబకర్ సిద్ధిఖి, మహమ్మద్ మన్సూరు అలీని 3 రోజుల కిందట ఐబీ అధికారులు అరెస్ట్ చేసి చెన్నైకి తీసుకెళ్లారు. ఐబీ అధికారులు అరెస్ట్ చేసిన తర్వాత రాయచోటి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. వారి ఇళ్లలో సోదాలు నిర్వహించి అనేక పేలుడు పదార్థాలు, బకెట్ బాంబులు, సూట్‌కేస్ బాంబులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇక్కడ స్థావరాలు ఏర్పరచుకున్న ఉగ్రవాదులపై రాయచోటి పోలీసులు వేర్వేరుగా రెండు కేసులు నమోదు చేశారు. అబూబకర్ సిద్ధిఖి అలియాస్ అమానుల్లా, ఆయన భార్య షేక్ సైరాబానుపై ఉపా యాక్ట్, పేలుడు పదార్థాల చట్టం, ఆర్మ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. మరో కేసులో ఉగ్రవాది షేక్ మన్సూర్ అలీ, ఆయన భార్య షమీం పైన ఇవే సెక్షన్లు వర్తింపజేస్తూ కేసులు నమోదు చేశారు. గురువారంషేక్ సైరా భాను, షేక్ షమీంను అరెస్ట్ చేసి రాయచోటి కోర్టులో హాజరుపరిచారు. వీరికి ఆశ్రయం ఇచ్చిన వారిని కూడా విచారించినట్లు సమాచారం. వీరు ఇక్కడ ఎంతకాలం నుంచి ఉంటున్నదీ, ఏమేం చేశారన్నది ఆరా తీస్తున్నారు.

# ఆలయాల్లో విగ్రహాలు, ఆభరణాల చోరీ

హైదరాబాద్,ఆలయాల్లో విగ్రహాలను, ఆభరణాలను చోరీ చేసే ముఠాను పట్టుకున్నారు. అక్కడ ఉన్న పంచలోహ విగ్రహాలు.. బంగారు ఆభరణాలువీరు చోరీ చేస్తారు. పోలీసులకు దొరక కుండా తప్పించుకుని వెళ్లిపోతారు. ఇలా చోరీ చేసిన విగ్రహాలను ముంబై, చెన్నై స్మగ్లర్లకు అమ్మేస్తున్నారు. వరుసగా చోరీలు జరుగుతుండడంతో సీరియస్‌గా తీసుకున్న పోలీసులు దర్యాప్తు చేయడంతో నిందితులు పట్టుబడ్డారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో వరుసగా జరుగుతున్న చోరీల కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. దాదాపు ఫిబ్రవరి నుంచి నిన్న మొన్నటి వరకు ఆలయాల్లో జరుగుతున్న చోరీలు పోలీసులను కలవరపాటుకు గురిచేశాయి. ఎంతగా దర్యాప్తు చేస్తున్నా.. దొంగలు పట్టుబడలేదు. కానీ సాంకేతిక ఆధారాలు, ఇతర అంశాలను ఆధారం చేసుకుని చివరకు కేసును ఛేదించారు.. ఈ కేసులో ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.5,36,300 విలువైన పంచలోహ విగ్రహాలు, ఇతర బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వరుసగా దేవాలయాల్లో చోరీలు పాల్పడుతున్న నిందితులను ఆంధ్రకు చెందిన పాత నేరస్తులని అధికారులు తేల్చారు. ఈ దొంగలు ఇద్దరిని కే. శివానంద, షేక్ హమ్ షరీఫ్‌గా పోలీసులు గుర్తించారు. నిందితులు కర్నూల్, ప్రకాశం జిల్లాలకు చెందిన వలస కార్మికులని చెబుతున్నారు. ఎలాగైనా డబ్బు సంపాదించాలని ఆలయాలపై చోరీలకు పాల్పడ్డట్లు తెలిపారు. శివానందపై గతంలో కాజీపేట్, మీర్‌పేట్, నాగోల్ పోలీస్ స్టేషన్లలో ఐదు కేసులు నమోదై ఉన్నాయి. ఫిబ్రవరి 27 నుండి జూన్ 30 మధ్య కాలంలో యాచారం, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని ఆరు ఆలయాల్లో చోరీలు చేశారని విచారణలో తేలింది. దొంగతనం చేసిన తర్వాత విగ్రహాలను ఉప్పల్‌కు చెందిన స్క్రాప్ వ్యాపారి శివకుమార్‌కు అమ్మేశారు.. నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు ఆలయాల నుంచి దొంగిలించిన పంచలోహ విగ్రహాలను చెన్నై, ముంబైలోని స్మగ్లర్లకు అమ్మేస్తున్నట్లు తెలుస్తోంది. అటు నుంచి విదేశాలకు కూడా ఈ పంచలోహ విగ్రహాలు వెళ్తున్నాయని పోలీసులు అనుమానిస్తున్నారు?

## ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల విధానం

కుప్పం,తెలంగాణలో గోదావరి ప్రాజెక్టులకు తాను ఎప్పుడూ వ్యతిరేకం కాదని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. తాను ఉమ్మడి ఎపి సిఎంగా ఉండగానే దేవాదుల ఎత్తిపోతలను ప్రారంభించానని గుర్తు చేశారు. గోదావరిలో ఏటా 2వేల క్యూసెక్కులకు పైగానే వృథ్ధాగా సముద్రంలో కలుస్తోంది. వీటిని ఎవరు వాడుకున్నా మంచిదేనని, అందుకే వృదానీటి ద్వారా బనకచర్లకు పూనుకున్నా మని అన్నారు. ఇందులో ఎవరు కూడా విమర్శలకు పోవాల్సిన అవసరం లేదన్నారు. కుప్పం పర్యటనలో ఉన్న బాబు గురువారం మీడియాతో మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్ట్‌తో ఎవరికీ నష్టం లేదని స్పష్టం చేశారు. సముద్రంలోకి పోయే నీటిని వాడుకుంటే రెండు రాష్ట్రాలు బాగుపడతాయని చెప్పుకొచ్చారు. తెలంగాణ ప్రాజెక్టలని తానెప్పుడూ వ్యతిరేకించలేదని స్పష్టత ఇచ్చారు. నీటి సమస్య పరిష్కారమైతే తెలుగువారు బాగుపడతారని ఉద్ఘాటించారు. వృథాగా సముద్రంలోకి పోయే వాటిలో 200 టీఎంసీలు వాడుకుంటే తెలుగు ప్రజలు బాగుపడతారు. నీటి సమస్య పరిష్కారమవుతుంది. ఇదే విషయాన్ని పదే పదే చెబుతున్నా.. ఎవరికీ నష్టం లేదు. తెలంగాణలో గోదావరిపై నిర్మించిన ప్రాజెక్టులను ఎప్పుడూ నేను వ్యతిరేకించలేదు. వ్యతిరేకించను కూడా అని అన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోమారు తీవ్ర వమిర్శలు గుప్పించారు. సింగయ్య భార్యను పిలిపించి బెదిరించి రాజకీయం చేస్తారా అని ప్రశ్నించారు. కారు కింద పడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించే ఓపిక కూడా లేదా అని ప్రశ్నించారు. కనీస బాధ్యత, సామాజిక స్పృహ లేకుండా ప్రవర్తిస్తారా అని నిలదీశారు. కారు కింద పడిన వ్యక్తిని కుక్కపిల్ల మాదిరిగా పక్కన పడేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమీ చేయలేని వాళ్లే శవ రాజకీయాలు చేస్తుంటారని ధ్వజమెత్తారు. నీతిమాలిన వాళ్లు, రౌడీలు రాజకీయాల్లో ఉన్నారని సీఎం చంద్రబాబు విమర్శించారు. చిల్లిగవ్వ కూడా ఖర్చు చేయని వాళ్లు తమ ప్రభుత్వం గురించి మాట్లాడు తున్నారని మండిపడ్డారు. దోచుకోవడమే తప్ప ఇవ్వడం తెలియని వాళ్లతో రాజకీయాలు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పేదలను మీరు ఆదుకోకపోగా.. పనిచేస్తున్న తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తారా అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు పనులు తాత్కాలికం.. చేసిన పనులే శాశ్వతమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. తానెప్పుడూ తప్పుడు ప్రచారాలతో రాజకీయాలు చేయలేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మామిడి రైతులకు తాము చేసినంత సాయం గతంలో ఎవరైనా ఇచ్చారా అని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. శవ రాజకీయాలు చేసే వారు మామిడి రైతులపై ప్రేమ కురిపిస్తున్నారని అన్నారు. రైతుల ఇబ్బందులను తాము పరిష్కరిస్తామని.. రైతులకూ తమపై నమ్మకం ఉందని ఉద్ఘాటించారు. మామిడి రైతుల గురించి.. వ్యవసాయం, హార్టీకల్చర్ గురించి ఏ మాత్రం పట్టించుకోని వారు ఇప్పుడు మాట్లాడతారా, మైక్రో సబ్సిడీలిచ్చారా అని ప్రశ్నించారు. హంద్రీనీవా పనులను తామే చేపడుతున్నామని స్పష్టం చేశారు. ఈ ఏడాదిలోనే రూ.3980 కోట్లు ఖర్చు పెడుతున్నా మని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయంలో లాభాలు వస్తాయని తెలిపారు.

# హరితహారానికి పదేండ్లు పూర్తి



హైదరాబాద్,'తెలంగాణకు హరిత హారం'.. రాష్ట్రంలో ఈ కార్యక్రమం పేరు తెలియనివారు ఉండరు. ఈ పథకం ప్రారంభమై పదేండ్లు పూర్తయ్యాయి. ఒక ప్రాంతం సుభిక్షంగా ఉండాలంటే ఆకాశాన్ని తాకే సౌధాలు, భారీ నిర్మాణాలు, ఉద్యోగాలు ఇచ్చే కంపెనీలు నెలకొల్పడం మాత్రమే కాదు.. ప్రజలు ఆరోగ్యంగా బతికేలా, పశుపక్షాదులకు ఆవాసం కల్పించి, జీవవైవిధ్యాన్ని కాపాడాలి. ఇందుకు తగిన మోతాదులో పచ్చదనం ఉండాలి. కాంక్రీట్ జంగల్‌ను, అటవీ విస్తీర్ణాన్ని సమతుల్యం చేయగలగాలి. పచ్చదనాన్ని పెంపొందించడం అంత సులభం కాదు, చిత్తశుద్ధి కలిగిన నాయకత్వం ఉంటేనే సాధ్యం అవుతుంది.తెలంగాణలో కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన 'తెలంగాణకు హరిత హారం'తో ఇది సాకారం అయ్యింది. రాష్ట్రంలో అటవీ విస్తీర్ణాన్ని పెంచి, ఆకుపచ్చని తెలంగాణను ఆవిష్కరించాలనే లక్ష్యంతో కేసీఆర్ ఈ బృహత్ పథకానికి శ్రీకారం చుట్టారు. 2015 జూలై 3న తొలి మొక్క నాటి హరిత యజ్ఞాన్ని ప్రారంభించారు. కేసీఆర్ మానస పుత్రిక వంటి ఈ పథకం తెలంగాణను ఆకుపచ్చగా మార్చింది. రాష్ట్రంలో అటవీ శాతాన్ని పెంచి తెలంగాణ ప్రజల ఆయుర్ధాయాన్ని, ఆరోగ్యాన్ని పెంచింది. ఈ విషయాన్ని జాతీయ, అంతర్జాతీయ సంస్థలే స్వయంగా వెల్లడించాయి. ఈ పథకం నీతిఆయోగ్, ఐక్యరాజ్యసమితి వంటి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందడమే కాకుండా, అనేక అవార్డులను దక్కించుకున్నది.

### 10వేల కోట్లు 290 కోట్ల మొక్కలు

రాష్ట్రంలో 24 శాతంగా ఉన్న పచ్చదనాన్ని 33 శాతానికి పెంచడమే లక్ష్యంగా కేసీఆర్ ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఏటా వానకాలం సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తొమ్మిది విడతల్లో 290.35 కోట్ల మొక్కలను నాటారు. 2015-16లో తొలిఏడాది 15.86 కోట్ల మొక్కలు నాటడంతో మొదలైన ప్రస్థానం.. 2017-18లో రికార్డు స్థాయిలో ఏకంగా 60.05 కోట్ల మొక్కలు నాటే స్థాయికి ఎదిగింది. ఏటా సగటున 30-40 కోట్ల మొక్కలను నాటారు.ఇందుకోసం ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. తొమ్మిది విడతల హరితహారం కోసం రూ.10,822 కోట్లు ఖర్చు చేసింది. అవసరమైన మొక్కలను పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా 14,864 నర్సరీలను ఏర్పాటు చేయించింది. ఈ పథకం కేవలం రోడ్ల పక్కన, అక్కడక్కడ చెట్లు పెంచడానికే పరిమితం కాలేదు. పల్లెలు, పట్టణాల్లో ప్రత్యేకంగా ప్రకృతి వనాలను ఏర్పాటు చేయించింది. ఈ విధంగా 13,657 ఎకరాల్లో పల్లె ప్రకృతి వనాలను, 6298 ఎకరాల్లో బృహత్ ప్రకృతి వనాలను, 1,00,691 కిలో మీటర్ల మేర రహదారి వనాలను, 12వేల కిలోమీటర్ల మేర బహుళ రహదారి వనాలను అభివృద్ధి చేసింది.

### ఫలించిన హరిత స్వప్నం

హరితహారం పథకం ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని ఆకుపచ్చగా మార్చాలన్న సీఎం కేసీఆర్ 'హరిత స్వప్నం' అనతికాలంలోనే నెరవేరింది. ఈ పథకం రాష్ట్రానికి ఆకుపచ్చ తోరణం తొడిగింది. రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం 6.85 శాతం పెరిగింది. పచ్చదనం 7.7 శాతం పెరిగింది. చెట్ల సంఖ్య 14.51 శాతం పెరిగినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2015లో తెలంగాణలో అటవీ విస్తీర్ణం 19,854 చదరపు కిలోమీటర్లు ఉండగా, 2021 నాటికి 21,214 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. 2019-21 మధ్య అటవీ విస్తీర్ణం పెరుగుదలలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. ఆ సమయంలో దేశంలో 0.22 శాతం(1540 చదరపు కిలోమీటర్లు) పెరిగితే, తెలంగాణలో 3.07శాతం(632 చదరపు కిలోమీటర్లు) పెరిగింది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే స్వయంగా వెల్లడించింది.

### ఆకుపచ్చ హైదరాబాద్

హరితహారంలో భాగంగా హైదరాబాద్, చుట్టు పక్కల ప్రాంతాల్లో భారీ ఎత్తున పచ్చదనం పెంపొందించారు. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే వెల్లడించింది. హైదరాబాద్‌లో పచ్చదనం 33.15 చదరపు కిలోమీటర్ల నుంచి 81.81 చదరపు కిలోమీటర్లకు పెరిగినట్టు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అంటే 246శాతం పెరుగుదల నమోదైంది. పచ్చదనం పెంపుపై హైదరాబాద్‌కు వరల్డ్ గ్రీన్‌సిటీ అవార్డు దక్కింది. దీంతోపాటు లివింగ్ గ్రీన్ ఫర్ ఎకనమిక్ రికవరీ అండ్ ఇన్‌క్లూజివ్ గ్రోత్ అవార్డును సైతం దక్కించుకున్నది. దేశంలో ఒక్క హైదరాబాద్ మాత్రమే ఈ అవార్డును అందుకోవడం గమనార్హం.

### హరితహారానికి 10శాతం గ్రీన్ బడ్జెట్

హరితహారం పథకానికి నిధులు సమస్య రావద్దనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. దేశంలో మరెక్కడా లేనివిధంగా 10 శాతం గ్రీన్ బడ్జెట్‌ను అమలు చేశారు. ఇందులో భాగంగా స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నిధుల్లో పచ్చదనం పెంపుకోసం 10శాతం నిధులను కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. నాడు 10శాతం గ్రీన్ బడ్జెట్ ప్రకటన పెద్ద సంచలనంగా మారింది. దేశంలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. దీంతో పాటు హరితహారం అమలు తీరుపైనా ఆయన ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. నాటిన మొక్కల్లో 85 శాతం బతకాలని నిబంధన పెట్టారు. లేనిపక్షంలో సంబంధిత అధికారులను బాధ్యులను చేస్తూ విధుల నుంచి తొలగించే విధంగా చర్యలు తీసుకున్నారు. భావి తరాలు కాంక్రీట్ జంగల్‌లో బంధీలు కాకుండా, రాష్ట్ర పచ్చదనాన్ని పెంచాలనే కేసీఆర్ ఆలోచన ఎంత బలమైందో ఈ ఉదాహరణ చెబుతుంది.

### పథకాన్ని నీరుగార్చిన కాంగ్రెస్ సర్కారు

భావి తరాల కోసం పరితపించిన కేసీఆర్ ఆశయాన్ని కాంగ్రెస్ సర్కారు నీరుగార్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పథకాన్ని క్రమంగా కనుమరుగు చేసే కుట్రకు తెరలేపింది. మొదట హరితహారం పేరును వనమహోత్సవంగా మార్చింది. కార్యక్రమం ప్రారంభోత్సవం పేరుతో కొంత హడావుడి చేసినా, పథకాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం చేతులెత్తేసింది.

# మోదీ పాలనలో జీఎస్టీ బాదుడు...




హైదరాబాద్, వస్తు, సేవల పన్ను అమల్లోకి వచ్చిన తర్వాత దేశ ప్రజలపై ట్యాక్సుల భారం నానాటికీ తీవ్రమవుతూ వస్తున్నది. 2017-18లో రూ. 7.41 లక్షల కోట్లుగా ఉన్న జీఎస్టీ వసూళ్లు.. 2024-25 నాటికి 22 లక్షల కోట్లకు చేరాయి. ఈ 8 ఏండ్లలో ఒక్కో భారతీయు డిపై జీఎస్టీ రూపేణా రూ.81 వేల భారం పడింది. కేంద్రానికి జీఎస్టీ రూపంలో వచ్చే ఆదాయం గడిచిన ఐదేండ్లలో రెట్టింపు కాగా.. 8 ఏండ్లలో మూడింతలైంది. ఆ మొత్తం సామాన్యుడి నుంచే వసూలు చేసిందే కావడం గమనార్హం. 2017 జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా జీఎస్టీ అమల్లోకి వచ్చింది. 17 స్థానిక పన్నులు, 13 సెస్సులను ఏకీకృతం చేసి.. ఐదంచెల వ్యవస్థగా దీన్ని రూపొందించారు. అప్పటినుంచి ఏటా జీఎస్టీ వసూళ్లు పెరుగుతూనే ఉన్నాయి. 2017-18లో జీఎస్టీ వసూళ్లు రూ.7.41 లక్షల కోట్లుగా ఉండగా 2024-25లో రూ.22.08 లక్షల కోట్లకు చేరుకున్నాయి. అంటే గడిచిన 8 ఏండ్లలో వసూళ్లు మూడురెట్లు పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ. 22.08 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇదే జీవనకాల గరిష్ఠం. అలాగే, 2020-21లో రూ. 11.37 లక్షల కోట్లతో పోలిస్తే తాజా వసూళ్లు రెండింతలయ్యాయి. అంటే గడిచిన ఐదేండ్లలో జీఎస్టీ వసూళ్లు రెండింతలైనట్టు లెక్క. 2023-24లో వసూలైన రూ. 20.18 లక్షల కోట్లతో పోలిస్తే, తాజా వసూళ్లు 9.4% ఎక్కువగా ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు.

### ఏప్రిల్‌లో రికార్డు వసూళ్లు

2024-25 ఆర్థిక సంవత్సరంలో సగటు నెలవారీ జీఎస్టీ వసూళ్లు రూ. 1.84 లక్షల కోట్లుగా ఉండగా గత ఏప్రిల్ ఒక్క నెలలోనే అత్యధికంగా రూ. 2.37 లక్షల కోట్లు వసూళ్లయ్యాయి. జీఎస్టీ ప్రవేశపెట్టినప్పటి నుంచి వసూళ్లలో ఇదే అత్యధికం. ఇక, గత మేలో నెలవారీ జీఎస్టీ వసూళ్లు రూ. 2.01 లక్షల కోట్లు కాగా, జూన్‌లో రూ. 1.85 లక్షల కోట్లుగా రికార్డయ్యాయి. గడిచిన ఎనిమిదేండ్లలో జీఎస్టీ కింద నమోదైన పన్ను చెల్లింపుదారుల సంఖ్య కూడా అంతకంతకూ పెరుగుతున్నది. 2017లో ఈ సంఖ్య 65 లక్షలుగా ఉండగా.. ప్రస్తుతం 1.51 కోట్లకు చేరింది.

### సామాన్యులకు శాపంగా..

సామాన్యులకు మేలు జరుగుతుందని, పన్నుల విధానంలో తాము నూతన విప్లవం తెచ్చామంటూ ఎనిమిదేండ్ల కిందట కేంద్రం జీఎస్టీని అమల్లోకి తెచ్చింది. అయితే, జీఎస్టీ కారణంగా పేద, మధ్యతరగతి వర్గాలపై అదనపు భారం పడినట్టు ఆర్థిక విశ్లేషకులు చెప్తున్నారు. గతంలో ట్యాక్స్ పడని అనేక వస్తువులను జీఎస్టీ పరిధిలోకి తేవడం, శ్లాబులను తరచూ మార్చుతుండటంతో పేద, మధ్య తరగతి ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతున్నదని అంటున్నారు. మొత్తంగా ఈ విధానం ప్రజలకు శాపంలా మారిందని చెప్తున్నారు. అధిక జీఎస్టీ పన్నుతో పేద, మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతున్నదని 'ఫైనాన్షియల్ అకౌంటబులిటీ నెట్‌వర్క్ ఇండియా' కూడా తన రిపోర్టులో తెలిపింది.

### అత్యధిక జీఎస్టీ మన దగ్గరే..

ప్రస్తుతం 160కిపైగా దేశాల్లో జీఎస్టీని అమలు చేస్తున్నారని, 28% శ్లాబ్ మాత్రం భారత్‌లో మినహా మరే దేశంలో లేదని నిపుణులు అంటున్నారు. అంటే ప్రపంచంలో అత్యధిక జీఎస్టీని (28%) వసూలు చేస్తున్న దేశంగా భారత్ మొదటి స్థానంలో ఉన్నట్టు చెప్తున్నారు.

### జీఎస్టీతో ద్రవ్యోల్బణ రేటుపై భారీ ఎఫెక్ట్

జీఎస్టీ ప్రవేశపెట్టడంతో ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు పెరుగుతుందని, ధరలు తగ్గుతాయని కేంద్రం చెప్పినా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయని ఆర్థిక వేత్తలు చెప్తున్నారు. దేశంలో జీఎస్టీ ప్రవేశపెట్టక ముందు 2016లో 4.9 శాతంగా ద్రవ్యోల్బణ రేటు ఉండగా, జీఎస్టీ ప్రవేశపెట్టిన తర్వాత 2022-23లో ఈ మొత్తం ఏకంగా 6.7 శాతానికి పెరిగింది. కాబట్టి పెరుగుతున్న ఆహార ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం పన్ను శ్లాబుల్లో మార్పులు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. పన్నులను కేవలం ఖజానాకు రాబడిగా మాత్రమే చూడకుండా ప్రజా ప్రయోజనాలను రక్షించాలని కోరుతున్నారు. కాగా అగ్రరాజ్యం అమెరికాలో ఇప్పటికీ జీఎస్టీ విధానాన్ని అమలు చేయడం లేదు. మలేషియా 2018లోనే ఈ విధానాన్ని రద్దు చేసుకున్నది.

### కనిపించని మౌలిక వసతులు

పన్నుల రూపంలో ప్రభుత్వానికి వచ్చే ఆదాయంతో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. వసతులు పెంచాలి. ప్రజల అవసరాలు తీర్చేలా పథకాలు, కార్యక్రమాలు ప్రవేశపెట్టాలి. కానీ ఎన్డీయే పదకొండేండ్ల పాలనలో ఇందుకు భిన్నంగా జరుగుతున్నదని ఆర్థిక విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూళ్లు గణనీయంగా పెరిగినా.. రోడ్లు, రైల్వేలు, విద్యుత్తు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఆ మేరకు పురోగతి కనిపించడం లేదని నిపుణులు విమర్శిస్తున్నారు. రోడ్లు అధ్వానంగా ఉండటంతో సగటున గంటకు 20 మంది, రోజుకు 500 మందికిపైగా, ఏడాదికి 1.50 లక్షల మందికిపైగా రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. రైల్వే భద్రత, ఆధునీకరణకు నిధులను సక్రమంగా వినియోగించకపోవడం వల్ల రైలు ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయి. భారత రైల్వే లెక్కల ప్రకారం.. 2014-2023 మధ్య 638 రైలు ప్రమాదాల్లో 781 మంది చనిపోయారు.

### విద్య, వైద్య సదుపాయాల్లో కొరత

జీఎస్టీ ఆదాయాన్ని సరైన నిష్పత్తిలో ప్రజల విద్య, వైద్య-ఆరోగ్య సంరక్షణ కోసం వినియోగించాలని ఆర్థిక వేత్తలు చెప్తున్నారు. కానీ, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అత్యవసర వైద్య సేవలు ఇప్పటికీ ప్రజలందరికీ అందుబాటుకి రాలేదు. గ్రామీణ ప్రాంతాల్లో 60 శాతం కంటే ఎకువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరిపడా వైద్య సిబ్బంది లేరని, అవసరమైన మందులు కూడా లేవని 2024లో ఒక నివేదిక వెల్లడించింది. నాణ్యత లేని వైద్య సంరక్షణ వల్ల ప్రతి లక్ష జనాభాకు ఏటా 122 మరణాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికీ దేశంలో 51 శాతం కుటుంబాలు వైద్యసేవలకు ప్రైవేటు హాస్పిటళ్లనే ఆశ్రయిస్తున్నాయని నివేదికలు చెప్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పేరుతో పథకాన్ని ప్రారంభించినా.. దీనిని ప్రజలందరికీ చేరువ చేయడంలో మాత్రం విఫలం అయ్యింది. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు, అర్హత కలిగిన ఉపాధ్యాయులు, డిజిటల్ లెర్నింగ్ సౌకర్యాలు లేకపోవడం వల్ల గ్రామీణ విద్యార్థులు నష్టపోతున్నారు.

### జీఎస్టీతో పేదలపై పెను ప్రభావం

గత పదకొండేండ్ల మోదీ పాలనలో ధరలు పెరగడంతోపాటు పన్నులు కూడా పెరిగాయి. జీఎస్టీ కారణంగా ప్రతి వస్తువు, సర్వీస్‌పై పన్ను విధించారు. దీంతో సాధారణ పౌరులతో పాటు పేద ప్రజలపై వంద శాతం ప్రభావం పడింది.

# సోషల్ మీడియా మయసభ

హైదరాబాద్,సోషల్ మీడియా ఇప్పుడు మన రొటీన్‌లో భాగమైంది. బంధుమిత్రులతో కనెక్ట్ అవ్వడానికి మంచి వేదికైంది. అనుభవాలను, అలవాట్లను, ఆలోచనలను పంచుకునే చోటు. ఇది కొంతమేర బాగానే ఉన్నా ఎదుటివారి 'సోషల్ బతుకు'లను చూస్తూ కుంగుబాటుకు లోనవుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. ఇతరుల విహారాలు, వినోదాలు, విలాసాలను చూస్తూ.. తమని తాము తక్కువ చేసుకుంటున్నారు చాలామంది. మరి సోషల్ మీడియాలో మనం చూసే ప్రతిదీ నిజమేనా? అంటే... 'కాదు' అనే చెప్పాల్సి వస్తుంది.'ఫ్యామిలీ ఓవర్ ఎవ్రీథింగ్' అంటూ ఫొటోను స్టేటస్‌గా పెట్టుకునేవారు పట్టుమని పది నిమిషాలు కూడా ఫ్యామిలీతో గడపకపోవచ్చు. 'ఫ్రెండ్స్ ఫర్ లైఫ్' అనేవారికి అసలు స్నేహితులే లేకపోవచ్చు. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అంటూ అర్ధరాత్రి పూట పోస్టులు పెడుతుండవచ్చు. 'అమ్మే దైవం' అని ఎమోషనల్ క్యాప్షన్స్ పెట్టేవారంతా అమ్మకు పనుల్లో సాయం చేస్తారన్నది అపోహే. పొద్దున నిద్ర లేవగానే దేవుడి వీడియోలను స్టేటస్‌లుగా పెట్టుకున్నవారు మంచి మనుషులనీ ఏ తప్పూ చేయనివారనీ అనుకుంటే పొరపాటే. పిల్లికి బిచ్చం వేయనివారే 'సొంత లాభం కొంత మానుకుని పొరుగువానికి తోడుపడవోయ్' అంటూ పోజులు కొట్టవచ్చు. నువ్వు లేనిదే నేను లేనంటూ ఇన్‌బాక్సుల్లో ప్రేమపాఠాలు వల్లె వేసేవారు... ఆ మాటే మరొకరికి చెప్పరని గ్యారంటీ లేదు.ఖరీదైన కారు ముందో, విలాసవంతమైన భవనం ముందో నిలబడి ఫొటోలు పెడితే వాళ్ల వైభోగాన్ని చూసి అసూయ కలుగుతుంది. కానీ అవి వాళ్ల సొంతమేనా కాదా, ఒకవేళ సొంతమే అయితే వాళ్లకు ఆ తాహతుందా, లేక ఆర్భాటాలకు పోయి ఆనక అప్పులతో ఇబ్బందులు పడుతున్నారా... అవేవీ మనకు తెలియదు. ఫొటోల కోసం ఎవరికో ఏదో సాయం చేస్తున్నట్లు నటించేవారు పెరుగుతున్నారని వారి సోషల్ మీడియా పోస్టులే చెబుతుంటాయి. ఇన్‌స్టాలోనో, స్నాప్‌చాట్‌లోనో అందమైన అమ్మాయిల ఫొటోలు చూసి ఆత్మన్యూనతకు లోనయ్యేవారూ, తామూ అలా కనపడాలని రకరకాల బ్యూటీ ప్రొడక్ట్స్ కొంటున్నవారూ లేకపోలేదు. ఫొటోలకు ఫిల్టర్లు ఉంటాయనీ ఎలాంటి వారైనా అందంగా కనిపించవచ్చనీ ఆ క్షణం స్ఫురించదు.తెరలమీద కనిపించేవన్నీ రకరకాల ఫిల్టర్లేసిన 'సోషల్ బతుకులు', నిజజీవితాలు కాదు. నిజాయతీగా ఉన్నదున్నట్లు చూపించుకునేవారూ ఉంటారు. కాకపోతే వారిది ప్రదర్శనలా ఉండదు, ఎవరికీ ఇబ్బంది కలిగించదు. లేనిది ఉన్నట్లూ ఉన్నది లేనట్లూ చూపించుకోవడానికి సోషల్ మీడియాను మయసభలా వాడుకునేవారితోనే సమస్యంతా. వాళ్లను చూస్తూ 'తోటి వాడు తొడ కోసుకున్నాడు... నేను మెడ కోసుకుంటా' అంటే జీవితంలో మిగిలేది అసంతృప్తి మాత్రమే! చిన్నప్పుడు మార్కుల విషయంలో అమ్మ మనల్ని అన్నతోనో చెల్లితోనో పోలిస్తేనే కోపం వచ్చేసేది కదా! మరిప్పుడు ముక్కూమొహం తెలియని వారితో ఎందుకు పోల్చుకోవాలి? సామాజిక మాధ్యమాలను చేతనైతే మన అవసరాలకు వాడుకోవాలి. లేకపోతే వాటికి దూరంగా ఉండాలి. అంతేకానీ వాటికి మనం వినియోగదారులుగా మారకూడదు.

## ఇవిఎంలపై అనేక అనుమానాలు ఉన్నాయి

న్యూఢిల్లీ,2024 ఎన్నికల్లో ఈవీఎంలపై ఎన్నో అనుమానాలు ఉన్నాయని, రానున్న ఎన్నికలు బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘంను వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కోరారు. ఎన్నికల నిర్వహణపై ఈసీ పునరాలోచించాలన్నారు. సాయంత్రం 6 తర్వాత ఏపీలోని ఎన్నో నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెరిగిందని, నాలుగు కోట్ల ఓట్లలో 51 లక్షల ఓట్లు సాయంత్రం 7 తర్వాతే పోలయ్యాయన్నారు. సాయంత్రం 6 తర్వాత పెరిగిన ఓట్లపై ఈసీని విచారణ అడిగాం అని వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. ఈవీఎంలపై అనుమానాలను వ్యక్తం చేస్తూ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డిలు ఈసీని కలిశారు. ఈసీ సమావేశం అనంతరం ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడారు. 'ఈవీఎంలపై ఎన్నో అనుమానాలు ఉన్నాయి. రానున్న ఎన్నికలు బ్యాలెట్ విధానంలోనే నిర్వహించాలి. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణపై పునరాలోచించాలి. ఎన్నికల సంఘం పిలుపు మేరకు ఎన్నికల నిర్వహణ, ఈవీఎంలు, ఓటర్ లిస్టుల విషయంలో చర్చ జరిగింది. 2024 ఎన్నికలకు సంబంధించి అనుమానాల నివృత్తిపై సమావేశం నిర్వహించాం. 2024 ఎన్నికల్లో ఈవీఎంల తీరుపై అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాలని కోరాం. ఈవీఎంలకు, వీవీప్యాట్‌లను కంపారిజన్ చేయమని అడిగాం. బ్యాటరీ చార్జింగ్ విషయంలో కూడా మా అనుమానాలను అడిగాం. పోలింగ్ మొదలైనప్పటి నుంచి చివరి వరకు బ్యాటరీ చార్జింగ్‌లో మార్పులను కూడా ప్రశ్నించాం. సాయంత్రం 6 తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెరిగింది. నాలుగు కోట్ల ఓట్లలో 51 లక్షల ఓట్లు సాయంత్రం 7 తర్వాతే పోలయ్యాయి. సాయంత్రం 6 తర్వాత పెరిగిన ఓట్లపై విచారణ అడిగాం. వీవీప్యాట్‌ల విషయంలో కౌంటింగ్ చేయడానికి వీలులేదని ఎన్నికల సంఘం నిర్బంధంగా చెబుతోంది. బ్యాటరీ చార్జింగ్ విషయంలో రీఛార్జిబుల్ బ్యాటరీలు అని చెప్పారు. ఎక్కువ శాతం పెరిగిన ఓట్లపై పరిశీలిస్తామని ఎన్నికల అధికారులు చెప్పారని వైవీ సుబ్బారెడ్డి తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్ సంఖ్య గణనీయంగా పెరిగింది. రాయచోటి నియోజకవర్గంలో ఓట్ల సంఖ్య పెరిగింది. ఓటర్స్ డేటా తెప్పించి చూస్తామని చెప్పారు. బీహార్లో లాగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్.. ఆంధ్రప్రదేశ్‌లో చేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం ఒప్పుకుంది. ఈవీఎంలపై టెక్నికల్ డౌట్స్ ఉన్నాయని ఆధారాలతో అడిగాం. హిందూపూర్‌లో పోలింగ్ బూతుల వివరాలతో సహా కేంద్ర ఎన్నికల సంఘానికి వివరించాం. క్షుణ్ణంగా పరిశీలిస్తామని చెప్పారు. ఓడిపోయామని ఈవీఎంలపై నేపం చూపెట్టట్లేదు. ప్రాక్టికల్‌గా మా వద్ద ఉన్న ఆధారాలను కేంద్ర ఎన్నికల సంఘం ముందు పెట్టాం. వైసీపీకి పార్లమెంట్లో 472 ఓట్లు వస్తే.. అసెంబ్లీలో ఒక ఓటు మాత్రమే వచ్చింది. కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్లో ఒక ఓటు వస్తే.. అసెంబ్లీకి 464 ఓట్లు వచ్చాయి. టీడీపీకి పార్లమెంట్లో 8 ఓట్లు వస్తే.. అసెంబ్లీకి 95 ఓట్లు వచ్చాయి. ఏపీలో కాంగ్రెస్ పరిస్థితి ఎలా ఉందో అందరికీ తెలుసు. పార్లమెంటుకు అసెంబ్లీకి ఓటింగ్ ప్యాట్రన్లో చాలా వ్యత్యాసం వచ్చింది. ప్రపంచంలో ఉన్న అభివృద్ధి దేశాల్లో యూస్, జర్మనీ, యూరప్ లాంటి దేశాల్లో బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు జరుగుతు న్నాయి . భారతదేశంలో కూడా పునరాలోచించాలని వైవీ సుబ్బారెడ్డి చెప్పుకొచ్చారు.

## పాపికొండల విహారయాత్ర నిలిపివేత

అల్లూరు,భారీ వర్షాల నేపథ్యంలో అల్లూరి జిల్లాలోని దేవీపట్నం నుంచి పాపికొండల విహారయాత్రను జలవనరుల శాఖ తాత్కాలికంగా నిలిపివేసింది. వర్షంతో పాటు గోదావరిలో నీటిమట్టం పెరుగుతున్న కారణంగా అధికారులు ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు దేవీపట్నం మండలం దండంగి, డి.రావిలంక గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రహదారిపై గోదావరి వరద ప్రవాహం పెరిగింది. దీంతో గండి పోచమ్మ ఆలయం వైపునకు రాకపోకలు నిలిచిపోయాయి.పోలవరం ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో పాటు నదీ పరివాహక ప్రాంతాల నుంచి నీరు భారీగా గోదావరిలోకి వచ్చి చేరుతోంది. పోలవరం ప్రాజెక్ట్ స్పిల్‌వే వద్ద నీటిమట్టం 27.16 మీటర్లకు పెరిగింది. ఇదిలావుంటే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆంధ్ర, ఒడిశా సరిహద్దులోని డుడుమ జలాశయం వద్ద నీటిమట్టాలు ప్రమాదస్థాయికి చేరుకున్నాయి. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 2,590 అడుగులు కాగా.. ప్రస్తుతం 2588.3 అడుగులకు చేరుకుంది. దీంతో ఏడో నంబరు గేటు ద్వారా వెయ్యి క్యూసెక్కుల వరద నీటిని దిగువన బలిమెల జలాశయానికి విడుదల చేస్తున్నారు.

# బీజేపీ రాజకీయ వ్యూహం.. మహిళకు అధ్యక్ష పదవి!..



ఢిల్లీ: బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎంపికపై సస్పెన్స్ కొనసాగుతోంది. అధ్యక్షుడు ఎవరు అని రాజకీయ వర్గాల్లో, పార్టీ వర్గాల్లోనూ చర్చలు జోరుగా సాగుతున్నాయి. జేపీ నడ్డా పదవీకాలం ముగిసి రెండేళ్లయినా, ఇంకా కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేయలేదు. అయితే, బీజేపీ వర్గాల నుంచి అందిన తాజా సమాచారం ప్రకారం.. జూలై రెండో వారంలో బీజేపీ కొత్త జాతీయ అధ్యక్షుడి పేరును ప్రకటించే అవకాశం ఉంది. దీంతో, కీలక పదవి ఎవరిని వరిస్తుందా? అనే ఉత్కంఠ నెలకొంది. ఇక, ఈసారి అధ్యక్ష పదవిని మహిళకు ఇచ్చేందుకు బీజేపీ ప్లాన్ చేస్తున్నట్టు నేషనల్ మీడియా(ఇండియా టుడే)లో కథనాలు వెలువడ్డాయి. బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి కోసం పార్టీ నుంచి ముగ్గురు మహిళల పేర్లను అధిష్టానం పరిశీలిస్తున్నట్టు తెలిసింది. వారిలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఎంపీ పురంధేశ్వరి, వనతి శ్రీనివాసన్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఇటీవల పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రస్తుత బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌లతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరి గురించి చర్చించినట్టు తెలుస్తోంది. ప్రధాని మోదీ విదేశీ పర్యటన నుంచి వచ్చిన తర్వాత.. తుది ని?ర్ణయం తీసుకునే చాన్స్ ఉంది.

### నిర్మల ముందంజ..

అయితే, రేసులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేరు ప్రముఖంగా ఉన్నట్టు సమాచారం. ఆమె విస్తృత అనుభవం, నాయకత్వ సామర్థ్యంపై చర్చ జరిగినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు.. అధ్యక్ష బాధ్యతలను సీతారామన్‌కు ఇస్తే దక్షిణాదిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి, పార్టీ విస్తరించడానికి సహాయపడుతుందనే అంచనాకు పార్టీ నాయకత్వం ఆలోచన చేసినట్టు సమాచారం. త్వరలో తమిళనాడులో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా నిర్మల కీలక పాత్ర పోషించనున్నారు. అంతేకాకుండా కేంద్ర ఆర్థిక మంత్రి, రక్షణమంత్రిగా విజయవంతంగా నిర్వర్తించారు. ఈమెకు ఆర్ఎస్ఎస్ మద్దతు సంపూర్ణంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆమెనే అధ్యక్షురాలు అవ్వొచ్చని వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ కారణాలతో పాటు వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని మోదీ సర్కార్ భావిస్తోంది. త్వరలోనే ఈ బిల్లును కూడా ఆమోదించాలని ఆలోచిస్తోంది. ఈ నేపథ్యంలో నిర్మలకు బాధ్యతలు ఇచ్చే విషయంపై చర్చలు జరుగుతున్నట్టు తెలిసింది.

### వనతి శ్రీనివాసన్..

తమిళనాడుకు చెందిన న్యాయవాది, బీజేపీ నాయకురాలు వనతి శ్రీనివాసన్ కూడా పరిశీలనలో ఉంది. ఆమె ప్రస్తుతం రాష్ట్ర అసెంబ్లీలో కోయంబత్తూర్ సౌత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 1993లో బీజేపీలో చేరినప్పటి నుండి రాష్ట్ర కార్యదర్శి, జనరల్ సెక్రటరీ, తమిళనాడు ఉపాధ్యక్ష పదవి సహా అనేక కీలక బాధ్యతలను ఆమె నిర్వహించారు. 2020లో పార్టీ బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. 2022లో బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యురాలిగా ఉన్నారు. దీంతో, ఆమె పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. అధ్యక్ష బాధ్యతలకు ఆమెకు అప్పగిస్తే తమిళనాడులో వనతి మార్క్ కనిపించే అవకాశం ఉంది.

### పురందేశ్వరి

రాజమండ్రి బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి పేరు కూడా రేసులో ఉన్నట్టు తెలుస్తోంది. సీనియర్ నాయకురాలైన పురంధేశ్వరి ఇప్పటికే పలు కీలక పదవుల్లో ఉన్న విషయం తెలిసిందే. మొన్నటి వరకు ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా పురంధేశ్వరి కొనసాగారు.

### ఆర్ఎస్ఎస్ ఆమోదం

మహిళా నాయకత్వం, ప్రతీకాత్మక, వ్యూహాత్మక ప్రయోజనాలను గుర్తించి, పార్టీ అత్యున్నత పదవికి మహిళను నియమించాలనే ఆలోచనను రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆమోదించిందని పార్టీ సైతం వర్గాలు వెల్లడిస్తున్నాయి. దీంతో, ఈసారి అధ్యక్ష బాధ్యతలను మహిళకే అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# కాంగ్రెస్ పై యాదవుల అసహనం.. తగ్గిన ప్రాధాన్యత లభిస్తుందా?

హైదరాబాద్,ఒకవైపు పార్టీ అధికారం లో ఉంది. మరోవైపు నేతలు పదవులు ఆశిస్తున్నారు. కానీ తీరా లిస్ట్ వచ్చేసరికి నిరుత్సాహానికి గురవుతున్నారు. దింతో ఏకంగా గాంధీభవన్‌లో తమ వర్గానికి పదవులు ఇవ్వాలంటూ నిరసనలకు దిగుతున్నారు. ఆయా సామాజికవర్గాల వారి డిమాండ్లపై క్లారిటీ ఇవ్వాల్సిన పీసీసీ, సీఎం మాత్రం వారిపైసీరియస్ అవుతున్నారంట. ఆ క్రమంలో పార్టీ పెద్దలపై పదవులు ఆశిస్తున్న వారు సైతం నారాజ్ అవుతున్నారంట. అసలింతకీ పదవుల పంచాయతీకి సంబంధించి కాంగ్రెస్‌లో జరుగుతున్న చర్చేంటి?

### యాదవ వర్గీయుల అసహనం

### కాంగ్రెస్ పదవుల్లో ప్రాధాన్యత లేదని యాదవుల అసహనం

కాంగ్రెస్ పార్టీలో పదవుల పంచాయితీ నడుస్తోంది. ముఖ్యంగా ఒక ప్రధాన సామాజికవర్గం పార్టీపై తీవ్ర అసంతృప్తితో కనిపిస్తోంది. బీసీ సామాజికవర్గానికి చెందిన యాదవులు పదవుల విషయంలో తమకు ప్రాధాన్యత తగ్గడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే పార్టీ పీసీసీ కార్యవర్గం లిస్ట్ వచ్చింది. వైస్ ప్రెసిడెంట్ లు, జనరల్ సెక్రటరీలు మొత్తం కలిపి 96 మంది పేర్లు జాబితాలో ఉంటే యాదవ సామాజికవర్గానికి కేవలం ఒకే ఒక పదవి యాదవ సామజికవర్గానికి దక్కింది.

### పార్టీ పెద్దలను కలిసి అసహనం వ్యక్తం చేసిన యాదవ నేతలు

దాంతో ఆ సామజికవర్గం నేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌ని, ఇతర పెద్దలను కలిసి తమ అసహనం వ్యక్తం చేశారు. పార్టీ అధికారంలోకి రావడానికి తాము ఎంతో కష్టపడ్డామని , బీసీల్లో యాదవ సామాజికవర్గం అత్యంత ప్రాధాన్యమైందని, అలాంటి తమకు అన్యాయం జరిగిందటూ ఆవేదన వెల్లగక్కారు. ఆ క్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ బీసీల్లో తన వర్గీయులకే ప్రాధాన్యత ఇస్తున్నారని, మేము పార్టీని నమ్ముకొని కష్టపడుతున్నా పదవులు రావడం లేదని కొందరు యాదవ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### గాంధీభవన్‌కు గొర్రెలను తీసుకొచ్చిన నిరసన

అలాగే క్యాబినెట్‌లో యాదవ సామజివర్గానికి చోటు కల్పించాలని కోరుతున్నారు నేతలు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, తెలంగాణలోనూ ఏ పార్టీ అధికారంలో ఉన్నా యాదవ సామజికవర్గానికి క్యాబినెట్‌లో ప్రాధాన్యత ఉండేదాని ఇప్పుడు మాత్రం వారిని పట్టించుకోవడం లేదని వారు విమర్శిస్తున్నారు. ఇటీవలే రాష్ట్ర పార్టీ



వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన గాంధీభవన్‌లో పీఏసి, అడ్వైయిజరీ కమిటి సమావేశాలు జరిగాయి. ఆ సమయంలో యాదవ సామజివర్గానికి చెందిన సంఘం నాయకులు గొర్రెలు తీసుకొచ్చి నిరసన వ్యక్తం చేశారు.

### నిరసన తెలిపిన నేతలకు సీఎం రేవంత్ వార్నింగ్

దానిపై సీఏం రేవంత్‌రెడ్డి కాస్త గట్టిగానే మందలించిన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పార్టీ లోని నాయకులే ఇదే చేయించారని.. ఇది సరికాదని ఇంకోసారి గాంధీభవన్ లో నిరసనలు, ధర్నాలు చెయవద్దని చేస్తే చర్యలు ఉంటాయని అందరికి కలిపి వార్నింగ్ కూడా ఇచ్చిన్నట్లు ప్రచారం జరుగుతోంది. పీసీసీ అధ్యక్షుడ్ని కలిసినప్పుడు యాదవ సామజివర్గానికి చెందిన నేతలకు పార్టీ లో తప్పనిసరిగా ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారంట. మరోవైపు మీలో ఐక్యత లేదని అందుకే టికెట్ లు ఇచ్చిన గెలిపించుకోలేదని అన్నట్లు సమాచారం.

### పార్టీ పదవుల్లో, నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని వినతులు

ఏది ఏమైనా యాదవ సామజికవర్గానికి చెందిన నేతలు మాత్రం పార్టీ పదవుల్లో, క్యాబినెట్లో తమకు అన్యాయం జరిగిందని ఇప్పటికైనా సముచిత న్యాయం చేయాలని, భర్తీ కావాల్సిన పార్టీ పదవులో, నామినేటెడ్ పోస్టుల్లో తగిన ప్రాధన్యత ఇవ్వాలని కోరుతున్నారు. మరి పీసీసీ, సిఏం తీరుపై అసంతృప్తిగా యాదవ సామజికవర్గానికి చెందిన నేతలకు రానున్న రోజులో తగిన ప్రాధాన్యత లభిస్తుందా? లేదా కాంగ్రెస్‌లో ఏ వర్గానికి ఎన్ని పదవులు కట్టబెట్టినా ఇలాంటి నిరసనలు, ధర్నాలు, అసంతృప్తులు సహజమే అని లైట్ తీసుకుంటారో చూడాలి.

# రామచంద్రరావుకు సవాల్‌గా మారిన జీహెచ్ఎంసీ, స్థానిక ఎన్నికలు

హైదరాబాద్,నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్రరావు రాకతో తెలంగాణ బీజేపీలో నయా జోష్ కనిపిస్తోందా? రాష్ట్రంలో బీజేపీని ప్రత్యామ్నాయ శక్తిగా కొత్త అధ్యక్షుడు మార్చగలుగుతారా? రామచంద్రరావు కూడా బండి సంజయ్ దూకుడును కొనసాగిస్తారా లేక సౌమ్యుడు కిషన్ రెడ్డి అడుగు జాడల్ని ఫాలో అవుతారా? ప్రస్తుతం రాష్ట్ర బీజేపీ వర్గాల్లో ఇదే చర్చనీయాంశంగా మారింది

### బీజేపీ బలం, బలహీనతలు తెలిసిన రామచంద్రరావు

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా కొత్తగా నియమితులైన రామచంద్రరావుకు ఆందోళనలు కొత్తకాదు. స్వతహాగా న్యాయవాది అయిన ఆ వకీల్ సాబ్‌కు పార్టీ బలం, బలహీనతల గురించి బాగా తెలుసు అనే టాక్ పార్టీ నేతల్లో వినిపిస్తుంది. బెంజ్ తెలుసు, గంజి తెలుసు అన్నట్టు పార్టీలో సంస్థాగత రాజకీయాలు, తెలంగాణ రాజకీయాలను రామచందర్‌రావు బాగా ఒంటబట్టించుకున్నారనేది పార్టీ నేతల మాట. తనపై వస్తున్న విమర్శలపై అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాతే గట్టిగానే సమాధానం ఇచ్చారు రామచంద్రరావు. గుండీలు చించుకొని మాట్లాడితే లీడర్ కాదు, సిద్ధాంతం ఒంట పట్టించుకున్నోడే నాయకుడు అంటున్న రామచంద్రరావు మాటలు బీజేపీలో హైప్ తెస్తోందంట

### ఆసక్తి రేపుతున్న రామచంద్రరావు వ్యవహారతీరు

బండి సంజయ్ లాంటి దూకుడు స్వభావం కిషన్ రెడ్డి లాంటి కామ్ అండ్ కూల్ నేచర్ ఉన్న అధ్యక్షులను తెలంగాణ బీజేపీ నేతలు చూశారు. ప్రస్తుతం అధ్యక్షుడిగా ఎన్నికైన రామచందర్‌రావు ఎలా వ్యవహారించబోతున్నారనేది ఇప్పుడు తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. బండి సంజయ్ ఎగ్రెసివ్ ధోరణిలో బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. తన హయంలో బీఆర్ఎస్ విధానాలను బలంగా ఎండగొట్టారు. ఆ తర్వాత బీజేపీ పగ్గాలను కిషన్ రెడ్డి చేపట్టారు. కిషన్ రెడ్డికి స్వతహాగా సౌమ్యుడన్న పేరుంది. బండి సంజయ్ లాగా ఎగ్రెసివ్ గా కాకుండా కిషన్ రెడ్డి ప్రణాళికాబద్ధంగా పార్టీ వ్యవహారాలను నడిపించారని పార్టీ నేతలు అంటుంటారు. ఇప్పుడు రామచంద్రరావు ఎలా పార్టీని ముందుకు తీసుకువెళ్లబోతున్నారనేది పార్టీలో హాట్ డిబెట్ అయిందట.

### గతంలో ఎమ్మెల్సీగా పనిచేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

స్వతహాగా న్యాయవాది అయిన రామచందర్‌రావు ఎమ్మెల్సీగా పని చేసిన అనుభవం ఉంది. పార్టీలో క్రియాశీలంగా పనిచేసిన అనుభవం ఉండడం రామచందర్‌రావుకు కలిసొచ్చే అంశంగా పార్టీ నేతలు చెబుతున్నారు. పార్టీలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై ఆయనకు పూర్తి అవగాహన ఉంది. సుదీర్ఘకాలంగా పార్టీలో యాక్టీవ్ రోల్ పోషించిన నాయకుడిగా నేతల పనితీరు,



అంతర్గత అంశాలను ఎలా డీల్ చేయాలన్నది ఆయనకు తెలియంది కాదు. పూర్తి స్థాయిలో పార్టీ కోసం పనిచేసే నిబద్ధత నూతన అధ్యక్షుడిగా రామచంద్రరావుకు కలిసొచ్చే అంశంగా చెప్తున్నారు.

### రాజకీయంగా, పార్టీలోని పరిణామాలతో సవాళ్లు

అయితే అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిని రామచంద్రరావుకు అటు రాజకీయంగా, ఇటు పార్టీలోని పరిణామాలతో సవాళ్లు ఎదురుకానున్నాయి. రాబోయేది ఎన్నికల కాలం. 2023 అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ కార్యకర్తల్లో కొంత నిరాశ నెలకొంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, 2028 అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ క్యాడర్‌ని సమర్థంగా సిద్ధం చేయాల్సి ఉంది. ఇలాంటి తరుణంలో పార్టీ పగ్గాలు చేపట్టిన రామచంద్రరావుకి జీహెచ్ఎంసీ ఎన్నికలతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికలు పెద్ద సవాలే అంటున్నారు

### బీజేపీలో రెడ్డి, ఓబీసీ నాయకుల మధ్య వర్గ విభేదాలు

రామచందర్ రావు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా పార్టీలోని అంతర్గత సమస్యలను అధిగమించడం, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో విజయం సాధించడం.. 2028 అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీని సన్నద్ధం చేయడం వంటి సవాళ్లను ఎదుర్కొబోతున్నారు. బీజేపీలో రెడ్డి మరియు ఓబీసీ నాయకుల మధ్య వర్గ విభేదాలు ఉన్నాయి. బండి సంజయ్, కిషన్ రెడ్డి వర్గాల మధ్య సమన్వయం సాధించడం రామచంద్రరావు ముందున్న ప్రధాన సవాలు అంటున్నారు. ఆ వర్గ విభేదాలను అధిగమించి, పార్టీని ఐక్యంగా నడపాల్సి ఉంటుంది. పార్టీలో పాత, కొత్త నేతల మధ్య నెలకొన్న వివాదాలు, విభేదాలను అధ్యక్షుడిగా రామచంద్రరావు చక్కదిద్దాల్సి ఉంది.సంజయ్ దూకుడు, కిషన్ రెడ్డి లాంటి సౌమ్యత కలగలిపి పార్టీని యాక్టివ్‌గా

# జపాన్‌లో వరుస భూకంపాలు.. తత్సుకీ మెగా సునామీ సంకేతమా?



టోక్యో: వరుస భూకంపాలు జపాన్‌లోని మారుమూల ద్వీపాలను నిద్రలేకుండా చేస్తున్నాయి. కేవలం రెండు వారాల్లో 900 భూకంపాలు సంభవించాయి. దీంతో ప్రజలకు రాత్రుళ్లు నిద్ర ఉండటం లేదు. ఏ క్షణం ఏం జరగుతుందోని ఆందోళనతో రాత్రంతా మేల్కొని ఉంటున్నారు. జూన్ 21 నుంచి టోకారా దీవుల చుట్టూ ఉన్న సముద్రాలలో భూకంప కార్యకలాపాలు చాలా చురుగ్గా ఉన్నాయని, బుధవారం 5.5 తీవ్రతతో భూకంపం సంభవించిందని అధికారులు తెలిపారు. అయితే ఎలాంటి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. కానీ అవసరమైతే ఖాళీ చేయడానికి సిద్ధంగా ఉండాలని ప్రజలకు సూచించారు. భూమిపై అత్యంత భూకంప ప్రమాదం ఉన్న దేశాలలో జపాన్ ఒకటి. టెక్టోనిక్ ప్లేట్లు కలిసే.. పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ ప్రదేశంలో ఉండటంతో తరచూ భూకంపాలు వస్తుంటాయి. ఇది ప్రతి సంవత్సరం దాదాపు 1,500 భూకంపాలను ఎదుర్కొంటుంది. కాగా, 12 టోకారా దీవులలో ఏడింటిలో దాదాపు 700 మంది నివసిస్తున్నారు. ఈ సుదూర దీవులలో కొన్నింటిలో ఆసుపత్రులు లేవు. ప్రిఫెక్చురల్ రాజధాని కగోషోమాకు వెళ్లాలంటే ఫెర్రీలో కనీసం ఆరు గంటలు ప్రయాణించాలి. భూకంపాల కారణంగా టోకారా దీవుల్లోని కొన్ని గెస్ట్‌హౌస్‌లు పర్యాటకులను అనుమతించడం లేదు. త్వరలో భారీ, ప్రాణాంతక భూకంపం సంభవించవచ్చునే వదంతులలో దేశం మొత్తం ఆందోళన చెందుతున్న తరుణంలో ఈ వరుస ప్రకంపనలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా.. శనివారం (జూలై 5న) మెగా సునామీ విరుచుకుపడబోతోందా? జపాన్, ఫిలిప్పీన్స్ మధ్య ప్రాంతాన్ని ముంచెత్తనుందా? 'జపాన్ బాబా వాంగా' పేరుతో ప్రసిద్ధురాలైన ర్యో తత్సుకీ జోస్యం నిజమైతే అక్షరాలా అదే జరగనుంది! 'ద ఫ్యూచర్ ఐ సా (నేను దర్శించిన భవిష్యత్తు)' పేరుతో రాసిన పుస్తకంలో ఆమె ఈ మేరకు ఎప్పుడో హెచ్చరించారు. దీంతో, శనివారం నిజంగానే సునామీ వస్తుందా అంటూ ప్రపంచవ్యాప్తంగా చాలామంది ఊపిరి బిగబట్టి మరీ ఎదురు చూస్తున్నారు. ఈ జోస్యానికి సంబంధించిన వార్తలు, చర్చోపచర్చలతో రెండు రోజులుగా ఇంటర్నెట్ అక్షరాలా హోరెత్తిపోతోంది. 'జూలై5డిజాస్టర్' ఇప్పుడు ఆన్‌లైన్‌లో ట్రెండింగ్‌లో ఉంది. ఈ భయాందోళనల నడుమ టోక్యో, సమీప ప్రాంతాల్లో విమాన తదితర ప్రయాణాలను జనం భారీగా రద్దు చేసుకుంటున్నారు.

### తత్సుకీ ఏం చెప్పారు?

కరోనా ఉత్పాతాన్ని కూడా తుత్సుకీ ముందే ఊహించి చెప్పడం విశేషం! అప్పటినుంచీ ఆమె పేరు ప్రపంచమంతటా మార్మోగడం మొదలైంది. ఇక జూలై 5న వస్తుందని పేర్కొన్న సునామీ గురించి తన పుస్తకంలో 20 ఏళ్ల ముందే పేర్కొన్నారామె. 'జపాన్, ఫిలిప్పీన్స్ నడుమ సముద్రగర్భం ఒక్కసారిగా బద్దలవుతుంది. ఆకాశహర్మ్యలను తలదన్నేంత ఎత్తున అలలు ఎగిసిపడతాయి. లక్షలాది మందికి ప్రాణగండం' అంటూ వర్ణించారు. దాంతో ఇది కూడా నిజమవుతుందా అంటూ ఎక్కడ చూసినా అంతులేని ఉత్కంఠ రాజ్యమేలుతోంది.

### ఎవరీ తత్సుకీ?

తత్సుకీ జపాన్‌కు చెందిన మాంగా ఆర్టిస్టు. 'ద ఫ్యూచర్ ఐ సా (నేను దర్శించిన భవిష్యత్తు)' ఆమె స్వయంగా చేత్తో రాసిన పుస్తకం. బ్రిటన్ యువరాణి డయానా మృతి, 2011లో జపాన్‌ను వణికించిన భూకంపం, సునామీ తదితరాలను అందులో ఆమె ముందుగానే పేర్కొన్నారు. అవన్నీ అక్షరాలా నిజమయ్యాయి కూడా. దాంతో గత శతాబ్దికి చెందిన బల్గేరియా మిస్టిక్, హీలర్ బాబా వంగా పేరిట ఆమెను ఇప్పుడంతా 'జపనీస్ బాబా వంగా' అంటూ కీర్తిస్తున్నారు.

# దేశవ్యాప్తంగా రాయచోటి కలకలం.. ఏం జరిగింది?




కడప: ఉమ్మడి కడప జిల్లాలోని రాయచోటి.. నియోజకవర్గం దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. ఇదేమీ రాజకీయ కలహాలతోనో.. హత్యలతోనో కాదు.. ఫ్యాక్షన్ ప్రాబల్యం ఉన్న సీమలో ప్రశాంతంగా ఉండే నియోజకవర్గాల్లో రాయచోటి ఒకటి. ఇక్కడ రాజకీయంగా కూడా పెద్దగా సమరాలు.. సాహసాలు ఉండవు. ప్రజలు కూడా ప్రశాంతంగానే ఉంటారు. అలాంటిది ఒక్కసారిగా ఈ నియోజకవర్గం దేశవ్యాప్తంగాకలకలం సృష్టించడానికి కారణమేంటి? ఎందుకు? జాతీయస్థాయిలో అధికారులు ఇక్కడకు వచ్చి పరిశీలన చేయడం ఏంటి? అనేది ఆసక్తిగా మారింది. రాయచోటి నియోజకవర్గం ఇప్పుడు ఉగ్రవాదులకు స్థావరంగా మారిందన్న వార్తే.. పెను కలకలం సృష్టి స్తోంది. ఇది ఎవరో చెప్పిన మాట కాదు.. సాక్షాత్తూ.. ఉన్నతాధికారి, పోలీసు డీఐజీ ప్రవీణ్ చెప్పుకొచ్చారు. రాయచోటిలో ఉగ్రవాదులకు శిక్షణ ఇవ్వడమేకాదు.. ఇక్కడ బాంబులు కూడా తయారు చేసినట్టు పేర్కొన్నారు. అయితే.. గుట్టు చప్పుడు కాకుండా.. చేసిన ఈ వ్యవహారం రాత్రికి రాత్రి జరిగింది కాదని కూడా చెప్పారు. ఉమ్మడి రాష్ట్రం విడిపోవడానికి ముందే.. అల్ ఉమాఉగ్రవాద ముఠా రాయచోటిలో అడుగు పెట్టినట్టు పేర్కొన్నారు. ఈ ముఠాకు చెందిన అబూబకర్ సిద్ధిఖీ, మహ్మద్ అలీని తమిళనాడు ఐబీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ఏపీ పోలీసులు కూడా అలెర్టు అయ్యారు. పాత చీరలు అమ్ముకుంటూ.. ఎవరికీ అనుమానం రాకుండా.. వీరు ఇక్కడ సంచరిస్తున్నారని గుర్తించారు. అంతేకాదు.. ఉగ్రవాదులకు శిక్షణ కూడా ఇస్తున్నారని తెలుసుకున్నారు. దాదాపు 50 ఐఈడీలు తయారు చేసే సామగ్రి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఈ వ్యవహారం ఒక్కసారిగా దేశవ్యాప్తంగా చర్చగామారింది. రాయచోటి నియోజకవర్గం జాతీయ స్థాయిలో చర్చకు వచ్చింది. 'అల్ ఉమా' పేరుతో దక్షిణాది రాష్ట్రాల్లో దాడులు చేయడమే లక్ష్యంగా ఇక్కడ ఉగ్రవాద స్థావరాలు ఏర్పాటయ్యాయి. ఓ కేసులో ఉప్పందున్న తమిళనాడు పోలీసులు.. రాయచోటిలో రహస్యంగా విచారణ చేశారు. ఈ క్రమంలోనే ఇక్కడ ఉగ్రవాద వ్యవహారం తెరమీదికి వచ్చింది. గత నెలలోనూ.. ఉత్తరాంధ్రలోని విజయనగరం జిల్లాలోనూ ఉగ్రవాది ఏజెంటును ఒకరిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇతనికి హైదరాబాద్‌లో సన్నిహితుడిగా మెలిగిన వ్యక్తిని కూడా అరెస్టు చేశారు. తాజా పరిణామంతో జాతీయ దర్యాప్తు(ఎన్ ఐఏ) అధికారులు కడప చేరుకున్నారు.

# ఎమ్మెల్యేలతో పవన్ భేటీ ఎపుడు ?

అమరావతి,ఏపీలో 2024 సార్వత్రిక ఎన్నికలు జనసేనకు ఎప్పటికీ గుర్తుండిపోయే మధుర జ్ఞాపకం అని చెప్పాల్సి ఉంది. అంతే కాదు ఏపీ రాజకీయ చరిత్ర పుటలలో జనసేన ఘన విజయానికి ఒక ప్రత్యేక స్థానం పేజీ కూడా కచ్చితంగా ఉంటాయి. పోటీ చేసిన 21 సీట్లలోనూ జనసేన ఘన విజయం సాధించింది. అంటే సెంట్ పర్సెంట్ స్ట్రైక్ రేట్ అన్న మాట. ఆ విధంగా అత్యద్భుతమైన విజయం సాధించుకున్న తరువాత ఏడాది కాలం ఇట్టే నడచిపోయింది. జనసేన ఎమ్మెల్యేలలో పవన్ తో కలిపి ముగ్గురికి మంత్రి పదవులు దక్కాయి. ఇక జనసేనలో కొందరు కీలక నేతలకు నామినేటెడ్ పదవులు కూడా లభించాయి. కూటమి పాలన ఇటీవలనే సుపరిపాలనలో తొలి అడుగు పేరుతో అమరావతిలో భారీ బహిరంగ సభను జరుపుకుంది. ఆ సభకు పవన్ కళ్యాణ్ సైతం హాజరై ఫైర్ తో కూడిన స్పీచ్ ని ఇచ్చారు. అంతా బాగానే ఉంది కానీ జనసేన ఎమ్మెల్యేలతో పవన్ భేటీ ఎపుడు అన్న ప్రశ్న వినిపిస్తోంది. పవన్ కళ్యాణ్ ఇపుడు ప్రతిపక్షంలో లేరు. అధికారంలో ఉన్నారు. జనసేన కూటమిలో కీలకమైన పాత్ర పోషిస్తోంది. ఆయన ఉప ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు తరువాత స్థానంలో ఉన్నారు. అయితే జనసేన ఎమ్మెల్యేలు పనితీరు ఎలా ఉంది. నియోజకవర్గాలలో పార్టీ పరిస్థితి ఏమిటి జనాలకు చేరువలో ఎమ్మెల్యేలు ఉంటున్నారా తమకు ఉన్న అధికార పరిధిలో సమస్యలు పరిష్కరిస్తున్నారా ఇత్యాది వాటి మీద ఒక మధింపు చేయాలంటే సమగ్రమైన సమీక్షా సమావేశం ఆరు నెలలకో లేక ఏడాదికో ఒకసారి అయినా పవన్ నిర్వహించాలి కదా అని అంటున్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేలు ఎంతమంది అధినేతను కలిసే అవకాశం ఈ ఏడాదిలో దక్కించుకున్నారు అన్నది కూడా ఒక ప్రశ్నగా ఉంది. పవన్ ముఖ్య నాయకులతోనే భేటీ అవుతారు. వారు అందించిన సమాచారంతోనే ముందుకు సాగుతారు అని అంటున్నారు. అయితే తాను కాకుండా 20 మంది ఎమ్మెల్యేలు అంటే ఒక బిగ్ నంబర్. వారు పార్టీకి అసలైన వారధులు సారధులు. వారే పార్టీ రథానికి చక్రాలు. వారితో సమావేశాలు నిర్వహిస్తేనే కదా గ్రౌండ్



లెవెల్ రియాలిటీ తెలుస్తుంది అని అంటున్నారు. అంతే కాదు టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్ని పనులు ఉన్నా ఎమ్మెల్యేలతో వీడియో కాన్ఫరెన్స్ లో అయినా లేదా టెలి కాన్ఫరెన్స్ లో అయినా కనెక్ట్ అవుతారు. తాజాగా ఆయన ఎమ్మెల్యేతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఇక వారిని ఇంటింటికీ పంపిస్తున్నారు. అటు పార్టీకి ఇటు జనాలకు వారు కనెక్ట్ అయ్యేలా చూసుకుంటున్నారు. మరి అలాంటి చొరవ జనసేనలో కూడా ఉండాలి కదా అన్న చర్చ వస్తోంది. ఏడాది కూటమి పాలనలో జనసేన కూడా ముఖ్య భాగస్వామిగా ఉంది కదా. అందువల్ల జనం వద్దకు జనసేన ఎమ్మెల్యేలు కూడా వెళ్ళి తాము ఏమి చేశామో ప్రజలకు వివరించి వారి మెప్పు పొందాల్సిన అవసరం ఉంది కదా అని అంటున్నారు. ఆ తరహా కార్యక్రమాలకు జనసేన కూడా శ్రీకారం చుట్టవచ్చు కదా అని అంటున్నారు. వాటి కంటే ముందు జనసేన ఎమ్మెల్యేలు తమ సమస్యలు నేరుగా అధినేతకు చెప్పుకోవాలని చూస్తున్నారు అని అంటున్నారు. వారికి ఆ సదవకాశాన్ని ఇవ్వాల్సి వస్తే కనుక కచ్చితంగా ఒక సమావేశం ఏర్పాటు చేసుకోవాల్సిందే అని అంటున్నారు. ఈ విషయంలో జనసేన అధినాయకత్వం చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com